పేలుడు ఘటనలో మృతులు

1. అప్పికొండ తాతబ్బాయి (50), కైలాసపట్నం, కోటవురట్ల మండలం, అనకాపల్లి జిల్లా
2. పురం పాప (40), చౌడువాడ, కోటవురట్ల మండలం, అనకాపల్లి జిల్లా
3. గుంపిన వేణు (40), చౌడువాడ, కోటవురట్ల మండలం, అనకాపల్లి జిల్లా
4. సేనాపతి బాబురావు(56), రాజుపేట, కోటవురట్ల మండలం, అనకాపల్లి జిల్లా
5. దాడి రామలక్ష్మి (38), రాజుపేట, కోటవురట్ల మండలం, అనకాపల్లి జిల్లా
6. సంగరాతి గోవింద (45), రాజుపేట, కోటవురట్ల మండలం, అనకాపల్లి జిల్లా
7. మెడిసి హేమంత్ (25), భీమిలి, విశాఖపట్నం జిల్లా
8. దేవర నిర్మల (38), సామర్లకోట, కాకినాడ జిల్లా

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
సోమవారం 14 ఏప్రిల్ 2025



పెను విషాదం

కోటవురట్ల మండలం కైలాసపట్నం బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు

ప్రమాదంలో క్షతగాత్రులు

- మడపాల జానకీరామ్ (బాణసంచా తయారీ కేంద్రం యజమాని), కైలాసపట్నం, కోటవురట్ల మండలం, అనకాపల్లి జిల్లా
- సియాద్రి గోవింద, కైలాస పట్నం, కోటవురట్ల మండలం, అనకాపల్లి జిల్లా
- సంగరాతి శ్రీను, కైలాస పట్నం, కోటవురట్ల మండలం, అనకాపల్లి జిల్లా
- గుంపిన సూరిబాబు, కైలాస పట్నం, కోటవురట్ల మండలం, అనకాపల్లి జిల్లా
- జల్లూరు నాగరాజు, రాట్నాల పాలెం కోటవురట్ల మండలం, అనకాపల్లి జిల్లా
- వేళంగి సంతోషి, సామర్లకోట, కాకినాడ జిల్లా
- వేళంగి షరోణి, సామర్లకోట, కాకినాడ జిల్లా
- వేళంగి రాజు, సామర్లకోట, కాకినాడ జిల్లా

మృతులు

ఫైల్ ఫొటోలు



సేనాపతి బాబురావు



దాడి రామలక్ష్మి



సంగరాతి గోవింద



పురం పాప



వేణుబాబు



అప్పికొండ తాతబ్బాయి

ఎనిమిది మంది కార్మికులు దుర్మరణం

మరో ఎనిమిది మందికి తీవ్ర గాయాలు

- నిర్వాహకుల నిర్లక్ష్యమే కారణం
- జిల్లాలో ఆరు బాణసంచా తయారీ కేంద్రాలకు మాత్రమే అనుమతి
- అనుమతి లేకుండానే నడుస్తున్నవి ఎన్నో...
- ప్రమాదాలు జరిగినప్పుడే అధికారుల హడావిడి



పేలుడు ధాటికి ఆనవాళ్లు లేని బాణసంచా తయారీ కేంద్రం

(అనకాపల్లి, కోటవురట్ల-ఆంధ్రజ్యోతి)

బాణసంచా తయారీ కేంద్రాలు తరచూ కార్మికుల ప్రాణాలు బలిగొంటున్నాయి. అనుమతులు, సరైన భద్రతా చర్యలు లేకుండా నిర్వహించడం, అనుభవం లేని వారితో పనులు చేయించడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ క్రమంలో అనకాపల్లి జిల్లాలోని కోటవురట్ల మండలం కైలాస పట్నంలో ఆదివారం సంభవించిన అగ్ని ప్రమాదం ఎనిమిది నిండు ప్రాణాలను బలిగొనగా, మరో ఎనిమిది మందిని తీవ్రగాయాలకు గురిచేసింది. మండలంలోని కైలాసపట్నం శివారున ఉన్న విజయలక్ష్మి గణేష్ ఫైర్ వర్క్స్‌లో మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో భారీ పేలుళ్లు సంభవించడంతో కార్మికులు హాహాకారాలతో పరుగులు తీశారు. ఎగసిపడిన మంటలు, గ్రామాన్ని కమ్ముకున్న దట్టమైన పొగతో భీతిల్లిన జనం ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు.

అనుభవం లేని కార్మికులతో విజయలక్ష్మి గణేష్ ఫైర్ వర్క్స్‌లో బాణసంచా తయారు చేయించడమే ప్రమాదానికి కారణమని తెలిసింది. ఒక వివాహానికి తారాజువ్వలు, బాంబుల సరఫరాకు భారీగా ఆర్డరు తీసుకున్న నిర్వాహకుడు అనుభవం లేని వారితో వాటిని తయారు చేయిస్తుండగా, మందులు కలపడంలో జరిగిన పొరపాటు వల్లే ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదించారు. కాగా ఫైర్ వర్క్స్ యజమాని నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమనే విమర్శలు ... మిగతా 6వ పేజీలో



మృతదేహం వద్ద విలపిస్తున్న యువతి



సంఘటన స్థలంలో క్షతగాత్రులు



మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు



కేజీహెచ్‌లో బాధితులను పరామర్శిస్తున్న హోం మంత్రి అనిత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, కలెక్టర్ విజయకృష్ణన్

విచారణకు ఆదేశం....

బాణసంచా ప్రమాద సంఘటనపై స్పందించిన ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, పలువురు మంత్రులు జిల్లా అధికారులతో మాట్లాడారు. ఎనిమిది మంది మృతిపై తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



కైలాసపట్నంలో పేలుడు జరిగిన బాణసంచా తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న హోం మంత్రి అనిత

కేజీహెచ్‌కు పేలుడు క్షతగాత్రులు

- ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో నలుగురు, ఆర్థో విభాగంలో ఒకరికి వైద్య సేవలు
- పరామర్శించిన హోం మంత్రి అనిత, ఎంపీ సీఎం రమేశ్

మహారాణిపేట(విశాఖ సిటీ), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాస పట్నంలో బాణసంచా తయారీ కేంద్రంలో ఆదివా రం జరిగిన పేలుడు ప్రమాదంలో తీవ్రంగా గాయ పడిన ఐదుగురిని విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తీసుకువచ్చారు. వీరికి ప్లాస్టిక్ సర్జరీ, ఆర్థోపెడిక్ విభాగంలో మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో క్షతగాత్రులు ఇక్కడికి తీసుకువచ్చారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో చికిత్స పొందుతున్న వారిలో జల్లూరి నాగరాజు (50), మడగల జానకీరామ్ (45), సియాదుల గోవింద్ (45), వేళంగి శర్వాణి ఉన్నారు. వీరిలో నాగరాజుకు 90 శాతం మేర శరీరం కాలిపోవడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. జానకీరామ్ శరీరం కూడా 50 శాతం మేర కాలిపోయిందని చెబుతున్నారు. గోవింద్‌కు 30 శాతం మేర శరీరంపై కాలిన గాయాలున్నాయి. అలాగే, రెండు కాళ్లకు గాయాలున్నట్టు వైద్యులు గుర్తించారు. వేళంగిని శర్వాణి ఎడమ చేతితోపాటు మరికొన్ని భాగాల్లో చిన్న గాయాలు ఉన్నట్టు గుర్తించారు. వేళంగి సంతోషికి కాలు విరగడంతోపాటు కుడి చేయి, తలకు గాయాలయ్యాయి. ఈమెకు ఆర్థో విభాగంలో వైద్యం అందిస్తున్నారు. కాగా కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పేలుడు బాధితులను హోం మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, కలెక్టర్లు విజయకృష్ణన్, హరేంధిర ప్రసాద్ ఆదివారం రాత్రి పరామర్శించారు. అందరికీ మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.





కేజీహెచ్‌కు తీసుకువచ్చిన క్షతగాత్రులు మడగల జానకీరామ్, జల్లూరి నాగరాజు



బాలాలయంలో నూకాంబిక అమ్మవారు



క్యూలైన్‌లో ఉన్న భక్తులు

నూకాంబిక అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

అనకాపల్లి నూకాంబిక అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్య జాతర ప్రారంభమైన తరువాత ఇంత పెద్ద సంఖ్యలో భక్తుల ఆలయానికి రావడం ఇదే ప్రథమం. తెల్లవారుజామున ఐదు గంటలకే భక్తులు బారులు తీరారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి భక్తుల తాకిడి బాగా పెరిగింది. ఆలయం ఆవరణలో క్యూలైన్లు నిండిపోవడంతో రోడ్డు వరకు క్యూలు పెరిగాయి. బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కొంతమంది పక్కనే ఉన్న తోటల్లో వంటలు చేసుకుని మధ్యాహ్నం భోజనాలు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఉత్సవ ప్రత్యేకాధికారి శోభారాణి, ఈవో రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- అనకాపల్లి టౌన్/ ఆంధ్రజ్యోతి

నర్సీపట్నం ఆస్పత్రిలో ముగ్గురు క్షతగాత్రులు

నర్సీపట్నం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని బాణసంచా తయారీ కేంద్రలో జరిగిన ప్రమాదంలో గాయపడిన వారిలో ముగ్గురిని స్థానిక ఏరియా ఆసత్రికి తీసుకువచ్చారు. అత్యవసర విభాగంలో ఉంచి వైద్య సేవలు అందిస్తున్నారు. వీరిలో సామర్లకోటకు చెందిన వేళంగి రాజు, కోటవురట్ల మండలం కైలాసపట్నానికి చెందిన గుంపిన సూరిబాబు, సంగరాత్రి శ్రీను వున్నారు. వీరిని హోం మంత్రి అనిత, ఎంపీ సీఎం రమేశ్, కలెక్టర్ విజయకృష్ణన్ పరామర్శించారు. ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వర్గాలను ఆదేశించారు.







నర్సీపట్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వేళంగి రాజు, గుంపిన సూరిబాబు, సంగరాతి శ్రీను

గుర్తుపట్టలేనంతగా కాలిపోయిన మృతదేహాలు

బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ధాటికి మృతదేహాలు గుర్తు పట్టలేని విధంగా కాలిపోయాయి. ఒక మహిళ శరీరం నడుము నుంచి కింద భాగం మాత్రమే మిగిలింది. పైభాగం ఆనవాళ్లు లేదు. కొన్ని మృతదేహాలకు చేతులు, కాళ్లు తెగిపోయాయి. దాడి రామలక్ష్మి, పురం పాప, గంపెన వేణుబాబు, సేనాపతి పైడినాయుడు ఉరఫ్ బాబూరావు, అప్పికొండ తాతబ్బాయి, సంగరాతి గోవింద్ మృతదేహాలను స్థానిక ఏరియా ఆస్పత్రి మార్చురీకి తీసుకువచ్చారు. కుటుంబ సభ్యులను బంధువులను రప్పించి మృతదేహాలను గుర్తు పట్టమన్నారు. డీఐజీ గోపీనాథ్ జెట్టీ, ఎస్పీ తుహీన్ సిన్హా ఏరియా ఆస్పత్రికి వచ్చి క్షతగాత్రులను పరామర్శించారు. కాగా ... మిగతా 6వ పేజీలో

పాడేరు ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

బ్రేకులు ఫెయిలై అదుపు తప్పిన బొలేరో వాహనం

- లోయలోకి దూసుకుపోవడంతో ఏడుగురికి తీవ్రగాయాలు
- మరో 11 మందికి గాయాలు
- ఒడిశా నుంచి తెలంగాణలో కూలి పనులకు వెళుతుండగా అల్లూరి జిల్లాలో ప్రమాదం







మాడుగుల సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మాడుగుల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బతుకు తెరువుకోసం పొట్టచేతో పట్టుకొని వలస వెళుతున్న కూలీలు ప్రమాదానికి గురయ్యారు. వీరు ప్రయా ణిస్తున్న బొలేరో వ్యాన్ పాడేరు ఘాట్ రోడ్డులో లోయలోకి దూసుకు పోవడంతో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. మరో 11 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి క్షతగాత్రులు, పోలీసులు అందించిన వివరాలిలా వున్నాయి.

ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా సిద్ధలమామిడి, రాళ్లగెడ్డ, కొత్తవలస, బొడ్డుగూడ గ్రామాలకు చెందిన 18మంది కూలీలు, తెలంగాణలో కూలి పనుల నిమిత్తం శనివారం మధ్యాహ్నం బొలేరో వాహనంలో బయలుదేరారు. పాడువా ... మిగతా 6వ పేజీలో

సరియా జలపాతంలో ఇద్దరు యువకుల గల్లంతు

అనంతగిరి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన సరియా జలపాతం వద్ద ఇద్దరు యువకులు గల్లంతైన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి.విశాఖపట్నం పూర్ణామార్కెట్ ప్రాంతానికి చెందిన ఆరుగురు యువకులు సరియా జలపాతాన్ని తిలకించేందుకు వచ్చారు. అయితే రెండో స్టెప్ జలపాతం అందాలను తిలకించి తిరిగి వెళుతుండగా.. మొదటి స్టెప్ డేంజర్ జలపాతం వద్దకు వచ్చేసరికి వారిలో వాసు, నరసింహ అనే ఇద్దరు యువకులు జారిపడి గల్లంతయ్యారు. వారిని రక్షించేందుకు స్నేహితులు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. సాయంత్రం కావడంతో స్థానికులు అనంతగిరి పోలీసులకు సమాచారం అందించారు. యువకులు గల్లంతైన విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందించారు.

వైభవంగా తలుపులమ్మ తల్లి ఆలయ ప్రారంభోత్సవం



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

ఎలమంచిలి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని షేకిళ్లపాలెంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నూతనంగా నిర్మించిన తలుపులమ్మ ఆలయం ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఆలయ కమిటీప్రతినిధులు ఆధ్వర్యంలో ఈ సందర్భంగా వేద పండితులు పూజలు చేశారు. తెల్లవారు నుంచి పూజలు చేపట్టిన అనంతరం అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే, వైసీపీ నాయకులు బొడ్డేడ ప్రసాద్, ఎంపీపీ గోవింద్, స్థానిక కౌన్సిలర్‌లు అమ్మవారికి పూజలుచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు టి వరహాలరావు,సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మలాడ చేరిన శ్రీరామ రక్ష రథయాత్ర



రథయాత్రలో విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్, భక్తులు

మునగపాక, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉమ్మలాడ గ్రామంలో శ్రీరామ రక్ష రథయాత్ర (ఆర్‌ఆర్‌ఆర్) ఆదివారం రథయాత్రను విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, శ్రీనివాసానంద సరస్వతి, నరేంద్ర జోషిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా డెయిరీ చైర్మన్ ఆనంద్ మాట్లాడుతూ ఎలమంచిలి నియోజకవర్గంలో 20 రోజులు రథయాత్ర కొనసాగుతుందన్నారు. రథయాత్రలో సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు అలరించాయి. రథ యాత్ర నాగులాపల్లి, ఒంపోలు, గంగాదేవిపేట మీదుగా మునగపాక చేరుకుంది. రాత్రి విరామం మునగపాక నందీశ్వర ప్రాంగణంలో జరిగింది. రథానికి భక్తులు అడుగడుగునా నీరాజనాలు పలికారు. ఎలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారితో పాటు పలువురు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కోర్సులతో ఉద్యోగ అవకాశాలు

మునగపాక, ఏప్రిల్ 13 (ఆంధ్ర జ్యోతి): ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు పాలిటెక్నిక్ కోర్సులు భరోసాగా నిలుస్తాయని ఆర్‌ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ భీమిశెట్టి ఉమాశంకర్ పేర్కొన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో స్పందించే హృదయం సంస్థ, శ్రీ షిర్డీసాయి లా కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతులకు ఆదివారం ఆయన విచ్చేశారు. ప్రవేశ పరీక్షకు సంబంధించి పాఠ్యాంశాలను వివరించారు. ఇటీవల డాక్టరేట్ పొందిన ఉమాశంకర్ మాస్టార్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్పందించే హృదయం సంస్థ వ్యవస్థాపకుడు ఎ.వి.ఎస్.మూర్తి, ఎం.సత్యనారాయణమూర్తి, మాడెం జోగారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెను విషాదం

... 5వ పేజీ తరువాయి

వెల్లువెత్తుతున్నాయి. కైలాసపట్నం శివారున ఉన్న బాణసంచా కేంద్రానికి 2026 వరకు అనుమతులున్నాయని అధికారులు చెబుతున్నా, అగ్నిమాపక శాఖ నుంచి 2024 తరువాత రెన్యువల్ కోసం నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) పొందలేదని తెలుస్తోంది. ప్రమాదకరమైన పేలుడు సామగ్రి తయారుచేసే ఈ కేంద్రంలో పరిశ్రమల శాఖ నిబంధనల ప్రకారం కార్మికులకు తగిన రక్షణ చర్యలు లేవని అక్కడి పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. భారీగా పేలుడు పదార్థాలు నిల్వ చేసి, సామగ్రి తయారు చేస్తున్నా కనీసం బోర్డు కూడా ఏర్పాటుచేయలేదు. ఈ కేంద్రంలో ఫైర్ ఎక్విప్‌మెంట్ ఉందా, కార్మికులకు మందుగుండు సామగ్రి తయారీపై శిక్షణ ఇచ్చారా..? ముడి పదార్థాల నిల్వలు సురక్షితంగా ఉన్నాయా... అనే ప్రశ్నలకు జవాబు దొరకడం లేదు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు కూడా బాణసంచా కేంద్రానికి అనుమతులున్నాయా లేదా అనేది స్పష్టం చేయలేకపోతున్నారు.

మొక్కుబడి తనిఖీలు

వాస్తవానికి బాణసంచా కేంద్రాలను మండల రెవెన్యూ అధికారి సందర్శించి, ఇచ్చిన నివేదిక మేరకు ఆర్డీఓ స్థాయి అధికారి అనుమతులు జారీచేస్తారు. దీంతోపాటు పరిశ్రమలు, పర్యావరణ, అగ్నిమాపక శాఖలు ఏటా తనిఖీ చేసిన తరువాత మాత్రమే నిరభ్యంతర పత్రాలు ఇవ్వాలి. కాగా ఎలాంటి తనిఖీ చేయకుండానే నివేదికలు సమర్పించి మమ అనిపిస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రమాదం సంభవించిన గంటల తరువాత జిల్లా యంత్రాంగం ఘటనా స్థలానికి చేరుకుంది. అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి వెంకటరమణ తదితరులు ప్రమాద స్థలిని పరిశీలించారు.

కనిపించని పర్యవేక్షణ

జిల్లాలోని బాణసంచా తయారీకేంద్రాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారుల పర్యవేక్షణ కనిపించడం లేదు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారిక రికార్డుల ప్రకారం కోటవురట్ల మండలం కైలాసపట్నం, ఎండపల్లి, నర్సీపట్నం మండలం వేములపూడి, మాకవరపాలెం మండలం భీమబోయినపాలెం, చోడవరం మండలం ఎంకేపాలెం, అచ్యుతాపురంలో మాత్రమే బాణసంచా తయారీ కేంద్రాలకు అనుమతులున్నాయి. అయితే అనధికారికంగా ప్రతి మండలంలో బాణసంచా తయారీ జరుగుతోంది.

ఉమ్మడి జిల్లాలోనూ సంఘటనలు

ఉమ్మడి విశాఖ జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రాల్లో అనేక ప్రమాదాలు సంభవించాయి. 2011లో మొగలిపురంలో అనధికార బాణసంచా తయారీ కేంద్రంలో సంభవించిన పేలుడులో ఇద్దరు మృతి చెందారు. 2019లో సబ్బవరం మండలం గుల్లిపల్లిలో అనధికార బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదంలో ఆరుగురు మృత్యువాతపడ్డారు. జిల్లా పునర్విభజన తరువాత 2022 జూన్‌లో సబ్బవరం మండలం ఆరిపాకలో అనధికార బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించి నలుగురు మృతిచెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అనుమతులున్న వాటితో పాటు, అనధికార బాణసంచా తయారీ కేంద్రాల్లో భద్రతా చర్యలు శూన్యమనేది బహిరంగ రహస్యం. వీటిలో ప్రమాదాలు సంభవిస్తున్నా బయటకు పొక్కనీయడం లేదు.

ప్రతి కుటుంబానిదీ ఓ దీనగాథ

కోటవురట్ల/నర్సీపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కైలాసపట్నంలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడులో మృతిచెందిన వారి కుటుంబాల్లో ఒక్కొక్కరిది ఒక్కో గాథ. ప్రమాదంలో మృతిచెందిన దాడి రామలక్ష్మి ఒంటరిగా జీవిస్తున్నది. ఆరేళ్ల క్రితం భర్త చనిపోయాడు. కుమార్తె ధనలక్ష్మికి గతంలోనే వివాహమైంది. ఆమె ఎలమంచిలి మండలం జంపపాలెంలో వుంటున్నది. మరో మృతుడు గంపెన వేణుకి భార్య భవాని,, కూతురు, కొడుకు ఉన్నారు. గుర్తు పట్టలేనంతగా వేణు మృతదేహం కాలిపోయింది. మొదట్లో చేనేత కార్మికుడిగా పని చేసేవాడు. ఆ వృత్తి కలిసి రాకపోవడంతో బాణసంచా తయారీ కేంద్రంలో కూలీగా వెళుతూ, ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు

కైలాసపట్నం గ్రామానికి చెందిన పురం పాప భర్త చనిపోయి 10 సంవత్సరాలు అవుతున్నది. ఈమెకు ఇద్దరు పిల్లలు వున్నారు. బాణసంచా ప్రమాదంలో ఆమె చనిపోవడంతో పిల్లలు అనాథలయ్యారు. కైలాసపట్నం గ్రామానికి చెందిన సంగరాతి గోవిందకు భార్య, ఇద్దరు పిల్లలు పిల్లలు వున్నారు. ఆయన మృతితో కుటుంబం వీధిన పడింది.



అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డులో తప్పుకునేందుకు భారీ వాహనాల అవస్థలు



చోడపల్లి, కొండకర్ల జంక్షన్ మధ్య రోడ్డుపక్కన వదిలేసిన బండరాళ్లు

క్వారీ లారీలతో భయం..భయం

- భారీ బండ రాళ్ల రవాణా ▸▸ పరిమితికి మించిన వేగం
- అనకాపల్లి- అచ్యుతాపురం మార్గంలో ప్రమాదాలు
- క్వారీ యజమానుల ఇష్టారాజ్యం ▸▸ నిద్రలో అధికారులు



కొండకర్ల జంక్షన్ వద్ద తిరగబడిపోయిన బండరాళ్ల లారీ

అచ్యుతాపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి నుంచి అచ్యుతాపురం మీదుగా పెద్దపెద్ద బండరాళ్ల లోడుతో వెళ్తున్న వాహనాలు బేంబేలెత్తిస్తున్నాయి. రాత్రి పగలు అన్న తేడాలేకుండా అధిక బరువుతో అతివేగంగా ప్రయాణిస్తుండడంతో స్థానికులతో పాటు వాహన చోదకులు తీవ్ర ఆందోళనకు లోనవుతున్నారు. ఈ వాహనాలను కట్టడి చేయాల్సిన అధికారులు కేవలం హెచ్చరికలతో మాత్రమే సరిపెట్టుకుంటున్నారు. పరిమితికి మించి బరువుతో బండరాళ్లను తీసుకువెళ్తున్న వాహనాలు వల్ల రహదారులు దెబ్బతింటున్నాయి. మార్గ మధ్యలో లారీల లోంచి బండరాళ్లు రోడ్డుపై పడిపోతుండడంతో జనాలు భయాందోళనకు లోనవుతున్నారు. ఇటీవల మునగపాకలో ఓ క్వారీ లారీ ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో గల క్వారీల నుంచి అచ్యుతాపురం మీదుగా రాంబిల్లి నేవల్ బేస్‌కి బండరాళ్లను రవాణా చేస్తున్నారు. గతంలో ఈ రవాణా వైసీపీ నాయకుల చేతుల్లో ఉండేది. పరిమితికి మించి బరువు రవాణాతో అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు పూర్తిగా పాడైపోయింది. వైసీపీ నాయకులు తమ వ్యాపారమే తప్పా రోడ్డు పరిస్థితిని పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రోడ్లు బాగుపడ్డాయి. కానీ, బండరాళ్ల రవాణా చేతులు మారినా నిబంధనల ఉల్లంఘనలు మాత్రం అలాగే కొనసాగుతున్నాయి. 20 టన్నులు పరిమితి ఉన్న భారీ టిప్పర్‌కు 50 నుంచి 60 టన్నుల వరకు వేస్తున్నారు. దీంతో రోడ్లు తిరిగి ఛిద్రమవుతున్నాయి. అంతేకాక ఈ వాహనాలు మార్గమధ్యలో సాంకేతిక లోపంతో ఆగిపోతున్నాయి. ఎక్కడ లారీ ఆగిపోతే అక్కడే రోడ్డు పక్కన బండరాళ్లను వదిలేసి వెళ్లిపోతున్నారు. వీటి వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఏదైనా ఘటన జరిగినప్పుడు అధికారులు హడావిడి చేయటమే తప్ప తనిఖీలు చేయటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి: ఎంపీ రమేశ్

అచ్యుతాపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి సమష్టిగా కృషిచేయాలని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. ఆదివారం అచ్యుతాపురం ఓ ఫంక్షన్ హాల్లో జరిగిన ఎలమంచిలి నియోజక వర్గ క్రియాశీల సభ్యుల సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్థానిక సమస్యల పరిష్కారానికి నాయకులు కృషిచేయాలన్నారు. ఈసందర్భంగా ప్రధాన మంత్రి మోదీ పదేళ్ల పరిపాలనలో సాధించిన విజయాలను వివరించారు. అనంతరం ఒకే దేశం ఒకే ఎన్నిక గురించి చర్చించారు. ఎలమంచిలి నియోజక వర్గం బీజేపీ కన్వీనర్ రాజాన సన్యాసి నాయుడు అధ్యక్షతన జరిగే ఈకార్యక్రమంలో బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో ఫ్లైఓవర్ వద్దు. రింగ్ రోడ్డు నిర్మించాలి

అచ్యుతాపురంలో ఫ్లైఓవర్ నిర్మాణానికి బదులు రింగ్‌రోడ్డు నిర్మించాలని అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు నిర్వాసితులు ఎంపీ సీఎం రమేశ్‌ను కోరారు. బీజేపీ క్రియాశీల సభ్యుల సమావేశంనకు హాజరైన రమేశ్‌ను నిర్వాసితులు కలిశారు. ఫ్లైఓవర్ కంటే రింగ్ రోడ్డువల్లే ఎక్కువగా ఉపయోగాలున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేశ్‌కుమార్, బిజేపీ నియోజకవర్గం కన్వీనర్ రాజాన సన్యాసి నాయుడు, పల్లి శేషగిరి రావు, దేశంశెట్టి అప్పలనాయుడు, బండారు కుమార్ గుప్త, డి. కాసుబాబు, ప్రగడ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగడ నాగేశ్వరరావుకు పరామర్శ

రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావుని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ఆదివారం పరామర్శించారు. నాగేశ్వర రావు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎంపీ రమేశ్ ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం కుదుట పడేవరకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో జనపరెడ్డి నరసింగరావు, నీరుకొండ నరసింగరావు, మేరుడు బాపునాయుడు, కూనిశెట్టి రమణ, కర్రి ఆదిబాబు, రమణ, బద్ది తాతాజీ, దేశంశెట్టి ఎల్లయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రమేశ్

సీతారాంపురంలో శిథిల కల్వర్టుకు మోక్షం

- రూ.10 లక్షల ఉపాధి నిధులతో నిర్మాణం .. గ్రామస్థులు హర్షం

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపురం వద్ద కొండగెడ్డపై సుమా రూ. 10 లక్షల ఎంజీఎన్‌ఆర్‌జీఎస్ నిధులతో కల్వర్టు నిర్మాణం పూర్తయింది. ఏన్నో ఏళ్లుగా శిథిలమైన ఈ కల్వర్టును తొలగించి కొత్తగా నిర్మించాలని నాయకులకు, అధికారులకు మొరపెట్టుకుంటున్నా వైసీపీ పాలనలో స్పందన కారాలేదు. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వంలో మోక్షం కలిగింది. నూతన కల్వర్టు నిర్మాణంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సీతారాంపురం గ్రామంలోనికి వెళ్లాలంటే ఈ గెడ్డపైనున్న కల్వర్టు మీదుగా ప్రయాణించాలి. ఎప్పుడో దశాబ్దాల కిందట నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరి కూలే స్థితికి చేరడంతో గ్రామస్థులు భయపడేవారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కల్వర్టును తొలగించి నూతనంగా కల్వర్టును నిర్మించాలని నాయకులను, అధికారులను ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా నిర్మించలేదు. ఎన్నికల్లో ప్రచారానికి వచ్చిన కూటమి అభ్యర్థి ప్రస్తుత రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను గ్రామస్థులు కల్వర్టు నిర్మించాలని కోరారు. హామీ మేరకు కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే అనిత సుమారు రూ. 10 లక్షల ఉపాధి నిధులు మంజూరు చేయడంతో కల్వర్టును పునర్నిర్మించారు.

కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి



శిథిలమైన కల్వర్టు పునర్నిర్మించాలని గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే హోం మంత్రి అనిత ఇచ్చిన హామీ మేరకు కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. కూటమి ప్రభుత్వంలోనే గ్రామంలో అభివృద్ధి పనులు జరిగాయి. గతంలో కూడా జాతీయ రహదారి నుంచి గ్రామానికి వేసిన రోడ్డు కూడా గత టీడీపీ ప్రభుత్వంలోనే నిర్మించారు.

- పక్కుర్తి వెంకటకృష్ణ, సర్పంచ్ సీతారాంపురం



సీతారాంపురంలో నిర్మించిన గెడ్డపై కల్వర్టు

పాడేరు ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

... 5వ పేజీ తరువాయి

పాడేరు, వడ్డాది మీదుగా అనకాపల్లి వద్ద 16వ నంబరు జాతీయ రహదారిపైకి చేరడానికి వస్తున్నారు. అర్ధరాత్రి పాడేరు చేరుకున్నారు. ఒంటి గంట సమయంలో ఘాట్‌రోడ్డులో వంట్లమామిడి దాటిన తరువాత కోమాలమ్మ పనుకు (ఏసుప్రభు మలుపు) వద్దకు వచ్చే సరికి బ్రేకులు ఫెయిలై వాహనం అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయింది. దీంతో పలువురికి తీవ్రగాయాలయ్యాయి. లోయ కావడం, చీకటిగా వుండడంతో ఎవరై రోడ్డుపైకి రాలేక, పెద్దగా కేకలు వేస్తున్నారు. కొంతసేపటి తరువాత ఈ మార్గంలో వెళుతున్న ద్విచక్ర వాహనదారులు ఆగి, మొబైల్ టార్చి లైట్లతో పరిశీలించారు. కానీ క్షతగాత్రులను రోడ్డుపైకి తీసుకువచ్చే అవకాశం లేకపోవడంతో తెల్లవారుజామున మూడు గంటల సమయంలో మాడుగుల అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఫైర్ ఆఫీసర్ వి.రాజేశ్వరరావు, సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి, లోయలో నుంచి క్షతగాత్రులను రోడ్డుపైకి చేర్చారు. అగ్నిమాపక శకటంలోనే ఎక్కించి ఉదయం 5.30 గంటల సమయానికి మాడుగుల సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. డాక్టర్ సంతోశ్ కుమార్, సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. క్షతగాత్రుల్లో మామిడి అప్పారావు, గుంట కాయేశ్, కొర్రా రామ్, డిప్పా తిరుపతి, గుంట లైకోన్, అభినాయక్ కొంటాల్, గుంట జంబోలకు తీవ్రగాయాలు కావడంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మిగిలిన గెమ్మెలి శ్రీదేవి, కొర్రా సుబంధీ, గెమ్మిలి సునీత, రాధ, గుంట షన్ముఖుడు, కొర్రా రంజిత్, మనోజ్, కొర్రా సింగల్, దోయమతి, లైకొన్‌లకు స్వల్ప గాయాలు కావడంతో మాడుగులలో చికిత్స అందించారు. కాగా ప్రమాదం గురించి తెలుసుకున్న క్షతగాత్రుల కుటుంబ సభ్యులు, బంధువులు ఉదయం 11 గంటలకు ఇక్కడకు చేరుకున్నారు. అనకాపల్లి, మాడుగుల ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని వాహనాల్లో తమ వెంట తీసుకెళ్లారు. కోరాపుట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటామని చెప్పారు. ఈ సంఘటనపై పాడేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నర్సీపట్నం ఆస్పత్రిలో ముగ్గురు క్షతగాత్రులు

... 5వ పేజీ తరువాయి

బాణసంచా తయారీ కేంద్రం లైసెన్స్ అప్పికొండ తాతబ్బాయి పేరున వుందని పోలీసులు తెలిపారు.

రెండు మృతదేహాలకు అనకాపల్లిలో పోస్టుమార్టం..

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కైలాసపట్నంలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడులో మృతిచెందిన వారిలో సామర్లకోటకు చెందిన డి.నిర్మల, భీమిలికి చెందిన ఎం.హేమంత్ మృతదేహాలను స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి తీసుకువచ్చారు. పంచనామా అనంతరం పోస్టుమార్టం నిర్వహించారు. సోమవారం ఉదయం బాధిత కుటుంబీకులకు మృతదేహాలను అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

బతుకు తెరువు కోసం వచ్చాం

- వేళంగి రాజు, సామర్లకోట

మాది కాకినాడ జిల్లా సామర్లకోట. బతుకు తెరువు కోసం నెల రోజుల క్రితం కైలాసపట్నం వచ్చి బాణసంచా తయారీ కేంద్రంలో పనిలో చేరాం. దీనికి సమీపంలో వున్న ఇంటో నివాసం వుంటున్నాం. ఈ రోజు పనిలోకి వెళ్లలేదు. మధ్యాహ్నం భారీ పేలుడు ధాటికి మా ఇంటి గోడలు పడిపోయాయి. నాకు తలకు గాయమైంది. భార్య సంతోషి, కూతురు షరోణికి తీవ్రగాయాలయ్యాయి. వారిద్దరిని విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించారు.

గ్రామీణ యువజన మందిరం అధ్యక్షుడిగా శ్రీకాంత్



బాధ్యతలు స్వీకరించిన ఆడారి శ్రీకాంత్

మునగపాక, ఏప్రిల్ 13 (ఆంధ్రజోతి): స్థానిక గ్రామీణ యువజన మందిరం అధ్యక్షుడిగా ఆడారి శ్రీకాంత్ ఎన్నికయ్యారు. దశాబ్దాలుగా ఏటా నాటక పరిషత్‌లు నిర్వహించడం యువజన మందిరం ప్రత్యేకత. స్థానికంగా ఆదివారం జరిగిన వనసమారాధనలో నూతన పాలకవర్గం ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షులుగా మళ్ల జోగారావు, మళ్ల రామజగన్నాథం, కార్యదర్శిగా ఆడారి సూర్యచంద్రరామారావు, సహాయ కార్యదర్శిగా దాడి అరుణ్‌కుమార్, కోశాధికారిగా ఆడారి లక్ష్మణరావు, క్రీడా విభాగం అధ్యక్షుడిగా పెంటకోట విజయ్‌తో పాటు ఏడుగురు సభ్యులను డైరెక్టర్లుగా ఎన్నికున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సూరిశెట్టి రాము, పెంటకోట సీతారాం, ముఖ్య సలహాదారుడిగా ఆడారి గంగ మహేశ్ కొనసాగనున్నారు. పాలక వర్గసభ్యులను పలువురు అభినందించారు.

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

అచ్యుతాపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పరిపాలనాధికారి రాము అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు అర్హత సాధించారు. గుడివాడలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో 100 కేజీల బరువు నెత్తి గోల్డ్ మెడల్ సాధించారు. దీంతో ఆయన జాతీయ స్థాయికి ఎంపికయారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



శంకర్ మృతదేహం

మునగపాక, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సమీపంలో విద్యుదాఘాతానికి లోనై ఒకరు మృతి చెందినట్టు స్థానిక ఎస్.ఐ పి.ప్రసాదరావు తెలిపారు. ఆదివారం గ్రామంలో విద్యుత్ స్తంభాలు మార్చారు. ఈ పనుల్లో పాల్గొన్న కూలి బోసల శంకర్ విద్యుత్ స్తంభంపై షాక్‌కు గురై కింద పడిపోయాడన్నారు. అతని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు సహచరులు చెప్పారన్నారు. మృతుడు చీడికాడ మండలం దండిసురవరం గ్రామం. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేడు ఎన్టీఆర్ కాలనీలో అంబేడ్కర్ జయంతి వేడుకలు

మునగపాక, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్.టి.ఆర్. కాలనీలో ఈ నెల 14వ తేదీన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలు జరగనున్నాయని అంబేడ్కరిజం పునాది వ్యవస్థాపకుడు రాజాన బుజ్జిబాబు తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా సోమవారం సాయంత్రం పలు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. పిల్లలకు ఆటవిడుపు ఏర్పాట్లు కూడా ఉన్నాయని చెప్పారు.

అయ్యప్పస్వామి ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

మునగపాక, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఈ నెల 14వ తేదీన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో ఈ కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు.. సాయంత్రం ఆలయం ఆవరణలో అన్నమయ్య స్వరతరంగణి, కోలాట ప్రదర్శన ఉంటాయని చెప్పారు.

గూడుపమ్మను దర్శించుకున్న గెడ్డం బుజ్జి



గెడ్డం బుజ్జికి అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ ధర్మకర్త శ్రీహరిరాజు

నక్కపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గూడుపమ్మతల్లి క్షేత్రాన్ని జనసేన పార్టీ నాయకుడు గెడ్డం బుజ్జి ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారికి బుజ్జి ప్రత్యేక పూజలు చేశారు. ఎన్నో విశిష్టతలతో నిర్మాణమైన ఈ అమ్మవారి ఆలయం భవిష్యత్‌లో మరింత ఖ్యాతి పొందుతుందని బుజ్జి అభిప్రాయపడ్డారు. ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరిరాజు అమ్మవారి చిత్రపటాన్ని బుజ్జికి అందజేశారు. కాగా, ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

గుడివాడలో రక్తదాన శిబిరం

ఎస్.రాయవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడివాడ గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో పలువురు యవకులు పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువకులకు నిర్వాహకులు, స్థానిక నాయకులు అభినందించి ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డి.శ్రీనుబాబు, మాజీ సర్పంచ్ ఎస్.వెంకటరాజు, నాయకులు ఎస్.బాబూరావు, పిల్లి వీర్రాజు, చలం, రమణ, సత్యనారాయణ, జాన్‌డేవిడ్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైక్

- ఓ యువకుడి మృతి.. నలుగురికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి, కేజీహెచ్‌కు తరలింపు



జగన్మోహన్ (ఫైల్)

చీడికాడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బి.సింగవరం సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమా దంలో ఓ యువకుడు మృతి చెందాడు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. సబ్బవరం మండలంలోని గొల్లలపాలెం గ్రామానికి చెందిన సిరసపల్లి జగన్మోహన్ (19) ఇద్దరు స్నేహితులతో కలిసి, చీడికాడ మండలంలోని అప్పలరాజుపురం గ్రామంలో ఓ శుభకార్యానికి ద్విచక్ర వాహనంపై వచ్చాడు. ఆదివారం రాత్రి తిరుగు పయణంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో వాహనం నడుపుతున్న జగన్మోహన్ అక్కడికి అక్కడే మృతి చెందాడు. వెనుక ఉన్న ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ఈ ప్రమాదంలో అక్కడే ఉన్న మరో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చేర్చగా ప్రథమ చికిత్స అనంతరం కేజీహెచ్‌కి తరలించారు. గాయపడ్డ ఎస్.సన్నమ్మడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సతీశ్ తెలిపారు.



గిడుతూరు హైస్కూల్‌లో కలిసిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మాకవరపాలెం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో గిడుతూరు ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ పాఠశాలలో 1984-85 బ్యాచ్‌లో పదో తరగతి చదువుకున్న వారంతా ఒక చోటకు కలుసుకుని సరదాగా గడిపారు. చదువుకునే రోజుల్లో చేసిన అల్లర్లు, జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు ఎటువంటి కష్టం వచ్చినా అందరం కలిసి ఆర్థికంగా ఆదుకుంటామని ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు

శ్మశానవాటికలో అభివృద్ధి పనులు



శ్మశానం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న టీడీపీ నాయకులు

గొలుగొండ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్మశానవాటికలో రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.రమేశ్, టీడీపీ మండల నేత ఎ.అప్పలనాయుడు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో రమేశ్ మాట్లాడుతూ గొలుగొండలో శ్మశానం అభివృద్ధికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు నిధులు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో త్వరితగతిన అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కసిపల్లి అప్పారావు, నాయకులు రాము, లక్ష్మీనారాయణ, చిట్టిబాబు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు



వేణుగోపాలస్వామిని దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగయ్యపేట శివారు సీతంపేట గ్రామంలో ఆదివారం వేణుగోపాలస్వామి ఆలయ శిఖర ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి రెండు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు, ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, వైసీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, టీడీపీ నేత నాయకులు సూర్యనారాయణ, స్థానిక నాయకుల కర్రి నాయుడు, కర్రి దేముల్లు, ఆదిరెడ్డి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాములు, లక్ష్మీదేవి విగ్రహాల ప్రతిష్ఠ



పాతిక గ్రామంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

చోడవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింహాద్రిపురం పంచాయతీ పరిధిలోని పాతిక గ్రామంలో ఆదివారం సీతారాములు, లక్ష్మీదేవి, విఘ్నేశ్వర విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ కార్యక్రమానికి పరిసర గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు.

అంబేడ్కర్‌కు బీజేపీ నేతల నివాళులు

చోడవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని బీజేపీ నాయకులు దీపాలంకరణ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కందర్ప రమణమూర్తి, నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం, పూలాభిషేకం చేశారు. అనంతరం విగ్రహం వద్ద దీపాలు వెలిగించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పీవీ రాజు, రిటైర్డ్ అధ్యాపకుడు దేముడు, ఇందిరానగర్ కాలనీ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్తంభంపై నుంచి పడి హెల్పర్‌కు తీవ్ర గాయాలు

కశింకోట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ పరిధిలో ఉన్న కాంట్రాక్ట్ కార్మికుడు బయ్యవరంలో విద్యుత్ స్తంభంపై పనిచేస్తుండగా, షాక్‌కు గురై కింద పడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి స్థానికుల ద్వారా తెలిసిన వివరాలివి. మాడుగుల నియోజకవర్గంలో ఉన్న వంటర్లపాలెం ప్రాంతానికి చెందిన సిహెచ్. శంకరరావు శనివారం ఉదయం 10.30 గంటల సమయంలో బయ్యవరంలో ఉన్న విద్యుత్ స్తంభంపై పనిచేస్తున్నాడు. ఒక్కసారిగా హెచ్‌టీ లైన్‌కు కరెంటు పాస్ కావడంతో దానికి చెయ్యి తగిలి కింద పడిపోయినట్టు తెలిసింది. ఈ ప్రమాదంలో శంకరరావు తలకు తీవ్ర గాయమైంది. విషయం తెలుసుకున్న స్థానికులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయండి

- ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి
- టీడీపీలో చేరిన పలు పార్టీల నాయకులు



ఎమ్మెల్యే బండారు సమక్షంలో టీడీపీలో చేరిన ఇతర పార్టీల నాయకులు

మాడుగుల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పరస్పరం గౌరవించుకుంటూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యే బండారు సమక్షంలో మాడుగులకు చెందిన కర్రి సీతారాం, చల్లా రామస్వామి, జొన్నపల్లి జగదీశ్, పాల సొసైటీ మాజీ అధ్యక్షుడు పాము వెంకట కృష్ణారావు, ఎంకోటపాడు, శంకరం పంచాయతీల నుంచి సుమారు వందమంది ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో బండారు మాట్లాడుతూ పార్టీ బలంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ సిద్ధాంతాలక కట్టుబడి పనిచేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతీ పథకం ప్రజలకు వివరించి, వారికి అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అద్దెపల్లి జగ్గారావు, పట్టణ అధ్యక్షుడు వద్దాది రంజిత్‌వర్మ, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, పార్టీ నేత పుప్పాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో రాయపురాజుపేట యువకుడి సత్తా



స్వర్ణ పతకంతో ప్రసాద్

చోడవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపురాజుపేట గ్రామానికి చెందిన కేవీవీఎస్‌పీ ప్రసాద్ రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో సత్తా చాటాడు. కృష్ణా జిల్లా గుడివాడలో శనివారం నిర్వహించిన 12వ రాష్ట్ర క్లాసిక్ రెజ్లింగ్ పోటీల్లో 74 కిలోల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. ఈ మేరకు ప్రసాద్‌ను రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ గంగాధర్, సర్పంచ్ రామునాయుడు, ఇతర నాయకులు అభినందించారు.

బీఎన్ రోడ్డులో గోతులు పూడ్చివేత



మట్టితో గోతులు కప్పుతున్న దృశ్యం

చోడవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గౌరీపట్నం జంక్షన్ సమీపంలో బీఎన్ రోడ్డులో ప్రమాదకరంగా తయారైన గోతులను నరసయ్యపేట పాల సంఘం మాజీ అధ్యక్షుడు కోరుబిల్లి దేముడు ట్రాక్టర్లతో మట్టి, ఇతర సామగ్రి తెప్పించి గోతులను పూడ్పించారు. ఈ గోతుల్లో చాలా మంది పడిపోయి ప్రమాదాల బారిన పడ్డారని, అందు వల్ల గోతులను పూడ్చివేయించామని ఆయన చెప్పారు. దీంతో దేముడును స్థానిక ప్రజలు అభినందించారు.

నర్సీపట్నంలో వడగండ్ల వాన



వడగండ్లతో కురుస్తున్న వాన

నర్సీపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నలో సాయంత్రం వడగండ్ల వాన కురిసింది. ఆదివారం మధ్యాహ్నం ఎండ దంచి కొట్టింది. సాయంత్రం ఈదురు గాలులతో కుండపోత వర్షం కురిసింది. భారీ అరగంట పాటు పడిన వర్షానికి వాతావరణం చల్లబడడంతో ఎండ వేడి నుంచి ప్రజలు ఉపశమనం పొందారు.

గురుకులంలో ప్రవేశానికి పరీక్షలు

చీడికాడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాం బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఆదివారం పరీక్ష నిర్వహించారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరిగిన ఈ పరీక్షలో ఐదో తరగతిలో చేరేందుకు 220 మంది దరఖాస్తు చేసుకోగా 198 మంది హాజరయ్యారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు 162 మంది దరఖాస్తు చేసుకోగా 128 మంది పరీక్షకు వచ్చారని ప్రిన్సిపాల్ హిమాచలం తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద మంచినీరు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

అంబేడ్కర్ జయంత్యుత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

దేవరాపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్వహించనున్న జ్యోతీరావు పూలే, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంత్యుత్సవాలను జయప్రదం చేయాలని అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం మండల అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను నాలుగు రోడ్ల కూడలిలో ఆదివారం ఆవిష్కరించారు. సోమవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ 134వ జయంతి ఉత్సవాలకు అందరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైక్

యువకుడి మృతి.. నలుగురికి తీవ్ర గాయాలు

క్షతగాత్రులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి, కేజీహెచ్‌కు తరలింపు



జగన్మోహన్ (ఫైల్)

చీడీకాడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బి.సింగవరం సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. సబ్బవరం మండలంలోని గొల్లలపాలెం గ్రామానికి చెందిన సిరసపల్లి జగన్మోహన్ (19) ఇద్దరు స్నేహితులతో కలిసి, చీడికాడ మండలంలోని అప్పలరాజుపురం గ్రామంలో ఓ శుభకార్యానికి ద్విచక్ర వాహనంపై వచ్చాడు. ఆదివారం రాత్రి తిరుగు పయణంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో వాహనం నడుపుతున్న జగన్మోహన్ అక్కడికి అక్కడే మృతి చెందాడు. వెనుక ఉన్న ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ఈ ప్రమాదంలో అక్కడే ఉన్న మరో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చేర్పగా ప్రథమ చికిత్స అనంతరం కేజీహెచ్‌కి తరలించారు. గాయపడ్డ ఎస్.సన్నమ్మడు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సతీశ్ తెలిపారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

450 మందికి వైద్య సేవలు



శిబిరంలో ఆరోగ్య తనిఖీలు చేస్తున్న వైద్య సిబ్బంది

రావికమతం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విశాఖపట్నానికి చెందిన పలు ఆసుపత్రుల వైద్య నిపుణులు గండి నిరుపమ, ఆళ్ల వసంత్‌కుమార్, ఎ.చంద్రశేఖర్, ఎన్.సాయికృష్ణ, పవన్ సంతోష్‌పల్లి, ప్రసన్న, ఇందిర, నారాయణ మూర్తి, కీర్తి తదితరులు జనరల్, క్యాన్సర్, కంటి, బీపీ, మధుమేహ, గైనిక్, చర్మ వ్యాధుల, కీళ్ల నొప్పులు తదితర రోగులకు వైద్య పరీక్షలు చేశారు. రావికమతం, బుచ్చియ్యపేట, మాడుగుల మండలాలకు చెందిన 450 మంది రోగులు వైద్య సేవలు పొందారు. వీరిలో 35 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించి విశాఖ ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో స్టార్‌వన్, సంజీవని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రతినిధులు ప్రసాద్, పులగాయల గోవింద, ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, గొంప ఎంపీటీసీ సభ్యుడు గంజి సూర్యనారాయణ, టీడీపీ నాయకులు పి.సత్యనారాయణ, నాగేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ అప్పారావు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ స్థలాల్లో ఇళ్లు ఇవ్వండి

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌కు వినతి

చోడవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం ఎలాంటి వసతులు కల్పించకుండా కొండపై ఇళ్ల స్థలాలు కేటాయించిందని, ఆ లబ్ధిదారులకు ప్రత్యామ్నాయ స్థలాల్లో ఇళ్లు కేటాయించాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తాతయ్యబాబుకు జనసేన జిల్లా కార్యదర్శి అల్లం రామప్పారావు విజ్ఞప్తి చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 23 మందికి కొండపై ఇళ్ల స్థలాలను కేటాయించారని, కొండపైకి వెళ్లేందుకు ఎలాంటి రహదారి, సౌకర్యాలు కల్పించలేకపోవడంతో లబ్ధిదారులు ఇళ్లు కట్టుకోలేకపోయారని చెప్పారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కొండపైకి రహదారి నిర్మించడమో, లేదా లబ్ధిదారులకు వేరే చోట స్థలాలు కేటాయించడమే చేయాలని ఆయన కోరారు. ఇదే సమయంలో గోవాడ పంచాయతీలో ఇళ్లు లేని వారికి కూడా ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రైవేటు జీపు డ్రైవర్ నిజాయితీ

ప్రయాణికుడు మరచిపోయిన రూ.2.6 లక్షల నగదు అప్పగించిన వైనం



బాధితుడికి నగదు అందిస్తున్న డ్రైవర్ సత్తిబాబు

చోడవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రయాణీకుడు తన జీపులో మరచిపోయిన రూ.2.6 లక్షల నగదు బ్యాగును తిరిగి క్షేమంగా అతనికి అందజేసి తన నిజాయితీని చాటుకున్నాడు జీపు డ్రైవర్. చోడవరం-పాడేరు రూటులో తిరిగే బాలాజీనగర్‌కు చెందిన డ్రైవర్ సత్తిబాబు జీపులో పాడేరులో శనివారం సాయంత్రం విశాఖపట్నంకు చెందిన కుమార్ ఎక్కాడు. చోడవరంలో దిగిన వెంటనే అతను తన డబ్బులు ఉన్న బ్యాగును మరచిపోయి వెళ్లిపోయాడు. ఈ బ్యాగును గుర్తించిన సత్తిబాబు అందులో డబ్బు ఉండడం గమనించి తన వద్ద జాగ్రత్తగా భద్రపరిచాడు. జీపులో డబ్బు మరచిపోయిన విషయం గమనించిన ప్రయాణికుడు కుమార్ ఆదివారం ఉదయం జీపు స్టాండ్‌కు వచ్చి డ్రైవర్‌ను సంప్రదించడంతో బ్యాగును తిరిగి అతనికి భద్రంగా అప్పగించాడు. రూ.2.6 లక్షల నగదు ఉన్న బ్యాగును అప్పగించిన డ్రైవర్ సత్తిబాబు నిజాయితీని కుమార్‌తో పాటు డ్రైవర్లు, స్థానికులు ప్రశంసించారు.

సత్యసాయి సేవా సంస్థల జోన్ ఇన్‌చార్జిగా రవిశంకర్



రవిశంకరును సత్కరిస్తున్న అప్పలనాయుడు

దేవరాపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా సత్యసాయి సేవా సంస్థల జోన్ ఇన్‌చార్జిగా రవిశంకర్‌ను నియమించినట్టు జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు ఆదివారం ప్రకటించారు. దేవరాపల్లి, కోటపాడు, చీడికాడ, సబ్బవరం మండలాల్లోని సత్యసాయి సేవా సంస్థలలో విస్తృత సేవలు అందించాలని ఆయన సూచించారు. ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని జోనల్ ఇన్‌చార్జి రవిశంకర్ చెప్పారు.

దారులన్నీ అమ్మ ఆలయం వైపే..

- భక్తులతో కిటకిటలాడిన అనకాపల్లి నూకాంబిక ఆలయం
- వివిధ జిల్లాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్య జాతర కొనసాగుతున్న నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చారు. తెల్లవారుజాము అరు గంటలకు బాలాలయంలోని అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తెల్లవారుజామున ఐదు గంటల నుంచే ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తుల రాక ఆరంభం కావడంతో ఆలయానికి వచ్చే మార్గాలన్నీ సందడిగా మారాయి. ఆలయం లోపల, ఆవరణలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు నిండిపోవడంతో రోడ్డుపై కూడా భక్తులు క్యూ కట్టి దర్శించుకున్నారు. పసుకు, కుంకుమ, చీరలు, పండ్లు తదితరాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఉత్సవ ప్రత్యేకాధికారిణి శోభారాణి, ఈవో రాంబాబు భక్తులకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆలయ మాజీ చైర్మన్ బీఎస్ఎంకే జోగినాయుడు, ఉత్సవ కమిటీ సభ్యుడు దాడి రవికుమార్, సూరే సతీష్, మారిశెట్టి వెంకటరావు, మజ్జి శ్రీనివాసరావు, కాండ్రేగుల రాజారావు, పొలిమేర ఆనంద్, కొడుకుల శ్రీకాంత్ తదితరులతో పాటు ఆలయ సిబ్బంది క్యూలో ఉన్న భక్తులకు మంచినీరు, పిల్లలకు పాలు అందజేశారు. సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఇంటర్వ్యూ..

మొండి బకాయిదారులకు కోర్టు నోటీసులు

-కె.నారాయణరావు, ఈవో, చోడవరం మేజర్ పంచాయతీ



చోడవరం మేజర్ పంచాయతీలో ఇంటి పన్ను వసూళ్లకు సంబంధించి మొండి బకాయిదారులకు కోర్టు నోటీసులు పంపించాం. వారి నుంచి సమాధానం వచ్చిన తదుపరి చర్యలు తీసుకుంటాం. అలాగే పంచాయతీ పరిధిలోని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు సమస్యల పరిష్కారానికి చేపడుతున్నాం.

ప్రశ్న: పట్టణ పరిధిలో ఇంటి పన్ను వసూళ్లకు సంబంధించి తీసుకుంటున్న చర్యలు?

ఈవో: ఏళ్ల తరబడి పన్ను చెల్లించని వారి జాబితా తయారు చేశాం. ఇందులో పదేళ్లుగా పన్ను చెల్లించని పది మంది మొండి బకాయిదారులకు తాజాగా కోర్టు నోటీసులు పంపించాం. మిగిలిన పన్ను చెల్లించకుండా ఎగవేస్తున్న వారి జాబితా కూడా సిద్ధం చేస్తున్నాం. మొండి బకాయిదారులపై త్వరలో చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలు ఎంత వరకు వచ్చాయి?

ఈవో: వార్డులలో సీసీ రోడ్లతో పాటు డ్రైనేజీల నిర్మాణాలు ఎక్కువగా చేపట్టాం. 24 రహదారుల నిర్మాణాలు ప్రారంభించగా, 18 సీసీ రోడ్లు పూర్తయ్యాయి. మరో నాలుగు రోడ్లు తుది దశకు చేరాయి.

ప్రశ్న: తాగునీటి సమస్య నివారణకు తీసుకుంటున్న చర్యలు?

ఈవో: వేసవిలో తాగునీటి సమస్య లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. పట్టణ పరిధిలోని ఆరు రక్షిత నీటి పథకాలకు ఇప్పటికే ప్రత్యామ్నాయంగా మోటార్లు సిద్ధం చేశాం. తాగునీటి సమస్య లేకుండా గౌరీపట్నంలో అదనంగా బోరు వెల్ నిర్మాణానికి చర్యలు చేపట్టాం. జన్నవరం పథకం నుంచి అవసరమైన సమయంలో నీరు తెచ్చుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నాం.

ప్రశ్న: రైతుబజారు నిర్మాణం ఎంత వరకు వచ్చింది. ఎప్పుడు ప్రారంభిస్తారు.

ఈవో: రైతుబజారు పనులు చివరి దశలో ఉన్నాయి. ఏప్రిల్ 15వ తేదీ నాటికి రైతుబజారు పూర్తి చేసి ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాం.

ప్రశ్న: పట్టణ పరిధిలో చెత్త డంపింగ్ యార్డు సమస్య నివారణకు తీసుకుంటున్న చర్యలు?

ఈవో: స్థానికంగా డంపింగ్ యార్డుకు అవసరమైన స్థలం ప్రధాన సమస్యగా ఉంది. చెత్త డంపింగ్ యార్డు ప్రత్యామ్నాయ స్థలం కోసం ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే ఎమ్మెల్యే దృష్టిలో ఉంచాం.

-చోడవరం, ఆంధ్రజ్యోతి

21న మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు పరీక్ష

చీడికాడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మంచాల మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో చేరేందుకు ఈ నెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ చెరకావు వెంకటలక్ష్మి ఆదివారం తెలిపారు. ఈ 20వ తేదిన నిర్వహించాల్సి ఉండగా ఈస్టర్ పర్వదినం కారణంగా వాయిదా వేసినట్టు చెప్పారు. సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరిగే ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులంతా వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకుని హాజరుకావాలని ఆమె తెలిపారు.

ప్రత్యేక గిరిజన భూ దర్బార్ ఏర్పాటు చేయాలని ర్యాలీ

రావికమతం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మైదాన ప్రాంత గిరిజనుల సమస్యలపై నర్సీపట్నం కేంద్రంగా ప్రత్యేక గిరిజన భూ దర్బార్ ఏర్పాటు చేయాలని గిరిజన సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గిరిజన సంఘం, ఐదో షెడ్యూల్ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జెడ్.బెన్నవరం నుంచి అజయ్‌పురం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కల్యాణపులోవలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గిరిజన సమస్యల పరిష్కారం కోసం భూ దర్బార్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నేత కె.గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

కైలాసపట్నం బాణసంచా ప్రమాద దృశ్యాలు..





ప్రమాదంపై బాణసంచా కర్మాగారంలో పనిచేసే కార్మికులను వివరాలు అడుగుతున్న హోం మంత్రి వంగలపూడి అనిత.. పక్కన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఓ వ్యక్తిని కేజీహెచ్‌లో చికిత్స కోసం తరలిస్తున్న దృశ్యం

రావికమతంలో ఏపీయూడబ్ల్యూజే సమావేశం

రావికమతం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం ఏపీయూడబ్ల్యూజే సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘ అనకాపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జోగినాయుడు, చంద్రరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలకు అక్రమ జీవో విడుదల చేయగా, తమ సంఘ రాష్ట్ర నాయకులు పోరాడి రద్దు చేయించారని చెప్పారు. అలాగే వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడేషన్ మంజూరులో గత ప్రభుత్వం విధించిన షరతులు ఈ ప్రభుత్వం రద్దు చేసిందని, పనిచేసే ప్రతి మండల విలేకరికి అక్రిడేషన్ మంజూరు చేయాలని ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపామని వారు తెలిపారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ అధ్యతన జరిగిన సమావేశంలో నాయకులు రామకోటి, ఎం.రాంబాబు, రొబ్బా శ్రీను, ఎస్.రామారావు, నాలుగు మండలాల విలేకరులు పాల్గొన్నారు.

చింతపల్లి ఎక్సైజ్ స్టేషన్‌కు ఇద్దరు ఎస్‌ఐలు నియామకం



విధుల్లో చేరిన ఎస్‌ఐలు రాంబాబు, చైతన్య

చింతపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎక్సైజ్, ప్రొహిబిషన్ ఎస్‌ఐలుగా ఎన్.రాంబాబు, వై.చైతన్య నియమితులయ్యారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో జరిగిన పదోన్నతులు, బదిలీల్లో యలమంచిలి స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రాంబాబు, పాడేరు ప్రధాన కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చైతన్యను ఎస్‌ఐలుగా పదోన్నతి కల్పిస్తూ చింతపల్లి ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌కి బదిలీ చేశారు. ఈమేరకు ఆదివారం ఇద్దరు ఎస్‌ఐలు విధుల్లో చేరినట్టు సీఐ కూర్మారావు తెలిపారు.

'పెట్రోల్ బంక్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'


మాట్లాడుతున్న గౌరవాధ్యక్షుడు సత్యాంజనేయ

పాడేరురూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జీసీసీ, ఐటీడీఏ నిర్వహిస్తున్న పెట్రోల్ బంకుల్లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పెట్రోల్ బంక్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) గౌరవాధ్యక్షుడు సత్యాంజనేయ డిమాండ్ చేశారు. ఆదివారం పాడేరులో నిర్వహించిన యూనియన్ పథమ మహాసభకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. జీసీసీ, ఐటీడీఏ పెట్రోల్ బంకుల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని, వేతనాలతో కూడిన నెలకు నాలుగు రోజులు సెలవులు కేటాయించాలన్నారు. జీసీసీ పెట్రోల్ బంకుల్లో పనిచేస్తున్న సిబ్బందికి థర్డ్ పార్టీ అయిన శ్రీమోదమాంబ మ్యాన్ పవర్ ఏజెన్సీ యాజమాన్యం కార్మికుల కష్టాన్ని దోచుకుంటుందని ఆరోపించారు. బంక్ సిబ్బంది సమస్యలను లేబర్ కమిషనర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. అనంతరం ఉద్యోగుల నూతన కమిటీ ఎంపిక చేశారు. యూనియన్ అధ్యక్షుడిగా శివశంకర్, కార్యదర్శిగా సోమేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా మోహన్, రామకిరీటి, ఉపాధ్యక్షులుగా మత్స్యరాజు, గంగులు, కోశాధికారిగా శ్రీకాంత్‌తో పాటు 11 మంది కమిటీ సభ్యులను ఎన్ను కున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పెట్రోల్ బంక్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ అమర్, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ రాజబాబు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైద్య ఉద్యోగి రమ్యశ్రీ మృతి


మృతురాలు రమ్యశ్రీ (ఫైల్)

చింతపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):మండంలోని లోతుగెడ్డ పీహెచ్‌సీ పరిధ బెన్నవరం ఆయష్మాన్ ఆరోగ్య మందిర్(వెల్‌నెస్ సెంటర్)లో ఎంఎల్‌హెచ్‌పీగా పనిచేస్తున్న గసాడి రమ్యశ్రీ (25) అనారోగ్యంతో మృతి చెందింది. రమ్యశ్రీ శనివారం అస్వస్థతకు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకొని వెళ్లారు. వైద్యులు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని కేజీహెచ్‌కి తరలించారు. ఆదివారం మధ్యాహ్నం ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. స్వ గ్రామమైన లోతుగెడ్డ జంక్షన్‌లో సోమవారం ఆమె మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ మృతిపై పీహెచ్‌సీ వైద్యాధికారి శివ ప్రసాద్, వైద్యసిబ్బంది, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యువీగిరి, సీనియర్ నాయకులు వసుపరి సామ్యుల్, ఏపీసీపీఎస్ నేత కుడుముల వెంకట రమణ సంతాపం వ్యక్తం చేశారు.

అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవాలు


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కళ్యాణ స్వామి

సీలేరు, ఏప్రిల్ 13 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరులో మన్యంలో ప్రసిద్ధి చెందిన అయ్యప్పస్వామి ఆలయం 10 వ వార్షిక మహోత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన వేదపండితుడు కళ్యాణ స్వామి ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకం, హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సోమవారం ప్రత్యేక పూజలు, మధ్యా హ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ కమిటీ ఈ సందర్భంగా తెలిపింది.

అప్రెంటీస్ షిప్ మేళా రేపు

అరకులోయ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అరకులోయ ఆర్‌ఐటీఐలో ఈ నెల 15 వ తేదీన ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటీస్ షిప్ మేళాను నిర్వహించనున్నట్టు అరకులోయ ఆర్‌ఐటీఐ ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో విశాఖపట్నంలోని డాల్ఫిన్‌హోటల్, ఫోర్‌ట్యూన్ ఇన్ శ్రీకన్య , శ్రీపోలీ ఫిల్మ్స్ , హెచ్‌వైజీఆర్‌వో కెమికల్ ఫార్మాటెక్ ప్రైవేట్ లిమిటెడ్, కనోరియా కెమికల్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ , ఆదిత్య టెక్నాలజీ పాట్నర్ , ఆర్‌హెచ్‌ఐ మాగ్నాస్టి గ్రాండ్‌బేహోటల్‌లలో ఐటీఐ అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఎలక్ట్రిషియన్ , ఫిట్టర్, ప్లంబర్, వెల్డర్, ఆర్అండ్ఏసీ ట్రేడ్‌లు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. అభ్యర్థులు 15 వ తేదీన ఒరిజినల్ సర్టిఫికెట్స్, బయోడేటా, రెండు పాస్‌పోర్టు ఫొటోలు, అన్ని సర్టిఫికెట్లు ఒక సెట్ జిరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు. వివరాలకు ఫోన్: 94413 74820, 94943 77802 నంబర్లను సం ప్రదించాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో మట్టల పండగ

» చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు

పాడేరురూరల్, ఏప్రిల్ 13(ఆం ధ్రజ్యోతి): పాడేరులో ఆదివారం క్రైస్తవులు మట్టల ఆదివారం పండగను ఘనంగా జరుపుకున్నారు. ఏసు క్రీస్తు సిలువకు అప్పగించే ముందు ఆదివారం జెరూసలెంకు ప్రవేశించిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ అన్ని చర్చిల్లో ఈ కార్యక్రమం జరిగింది. మట్టల ఆదివారం విశిష్టతను తెలిసేలా పట్టణ పురవీధుల్లో ఈత మట్టలను చేత పట్టి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం భక్తి శ్రద్దలతో చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలో పాటు పరిసర గ్రామాల చర్చిల్లో కూడా ఈ వేడుకలను ఎంతో వైభవంగా నిర్వహించారు. క్రీస్తు గీతాలాపనలు, ప్రార్థనలు చేస్తూ ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు సీహెచ్. దైవకృప, జీ.తిమోతి, పి.జాన్ ఫ్రెడ్రిక్, ఎం.బాబూరావు, బుచ్చయ్య, వై.వై.రత్నం, ఎం.డానియల్, జామవా, వి.మత్స్యరాజు, ప్రేమ్‌కుమార్, యోబు, ఎస్.అబ్రహం, పి.డేవిడ్, ఎజ్రా, ఇశ్రాయేల్‌రాజు, జాన్‌డేవిడ్, లూకా పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలో క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారాన్ని జరుపుకున్నారు. ఏటా గుడ్‌ఫ్రైడేకు ముందు మట్టల ఆదివారంగా ఆచరించడం ఆనవాయితీగా వస్తుంది. క్రీస్తు శిషుల మరణానికి ముందు బేతనీయ పట్టణం నుంచి ఎరుషలేముకి యాత్రగా వెళ్లినప్పుడు ప్రజలు ఆయన వెంట ప్రజలు ఖర్జూరపు మట్టలు పట్టుకుని వెళ్లారు. దీనికి చిహ్నంగా ఆదివారం క్రైస్తవులు చర్చీలకు మట్టలతో వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


సీలేరు యూసీబీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం


పాడేరులో మట్టలతో ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు

స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఫాదర్ బాలరాజు, ఆదివాసీ ప్రభావిత పథం చర్చిలో పాస్టర్ ఏసురత్నం వాక్యోపదేశం చేశారు. సెయింట్ ఆన్స్ పాఠశాల సిస్టర్లు, క్రైస్తవులుర్యాలీ చేశారు. ఈకార్యక్రమంలో సెయింట్ ఆన్స్ పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ కార్లీన్, ప్రిన్సిపాల్ రేణు, మాజీ ఎంపీపీ మచ్చమ్మ పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని మొండిజామిగుడ చర్చ్ వద్ద జోయ్ అండ్ పీస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలోని మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు.. ఏసుక్రీస్తు ప్రభును యేరుషలేం పురవీధుల్లో ఊరేగింపుగా తరలించిన సందర్భంగా దానిని గుర్తుచేసుకుంటూ.. క్రైస్తవులంతా మట్టలను పట్టుకుని, ఏసుక్రీస్తుకు జయం అంటూ నినాదాలు చేశారు.. ఈ కార్యక్రమంలోని స్థానిక సంఘ కాపరి పీటర్, మహిమ, తదితరులు పాల్గొన్నారు.

సీలేరు: జీకేవీధి మండలం సీలేరులో క్రైస్తవులు మట్టల ఆదివారం పండగను ఘనంగా జరుపుకున్నారు. యూసీబీఎం చర్చి పాస్టర్ మనస్సే ఆధ్వర్యంలో క్రైస్తవులు పిల్లలు, పెద్దలు ఈత కొమ్మలను పట్టుకుని హోసన్నఅంటూ గీతాలను ఆలపిస్తూ యూసీబీఎం చర్చికు చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు కు శిలువ వేసే ముందు ఏరుసలేములో రాజు గా తిరిగే వాడని గుడ్‌ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారం ను మట్టల ఆదివారంగా వేడుకలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని పాస్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

ముత్యాలమ్మ జాతరకు పటిష్ట భద్రత:సీఐ


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సీఐ వినోద్‌బాబు

చింతపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మ జాతరకు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నట్టు స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. వినోద్‌బాబు తెలిపారు. ఆదివారం పోలీసులకు బస చేసేందుకు వసతి కోసం గిరిజన సంక్షేమశాఖ పాఠశాలలను సీఐ పరిశీలించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ఈనెల 24 నుంచి 27 వరకు జరిగే జాతరలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండగా, భక్తులకు భద్రత కల్పించేందుకు తమ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుందన్నారు. సుమారు 300మంది కానిస్టేబుళ్లు, ఎస్‌ఐలు, సీఐలు వస్తారన్నారు. పోలీసులు నాలుగు రోజులు బస చేసేందుకు వసతి కోసం ఆశ్రమ పాఠశాలలను పరిశీలిస్తున్నామన్నారు. జాతరను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఎస్సై వెంకట రమణ, హెచ్‌ఎం సాగిన రామరాజు పడాల్ పాల్గొన్నారు.

దుస్తులు, స్టడీ మెటీరియల్ వితరణ


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఎంపీపీ రత్నకుమారి తదితరులు

పాడేరురూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిండంగి గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు కృతజ్ఞత చారిటబుల్ సొసైటీ సమకూర్చిన బట్టలు, స్టడీ మెటీరియల్‌ను ఆదివారం ఎంపీపీ ఎస్.రత్నకుమారి, పంచాయతీ సర్పంచ్ కూడా శ్రీలక్ష్మి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీ ప్రతినిధులు అందిస్తున్న సేవలను గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సొసైటీ ఫౌండర్ ఆతవా రమేశ్ మాట్లాడుతూ 300 మంది డోనర్స్, 50 మంది వలంటీర్స్‌తో గత ఐదేళ్లగా సేవా కార్యక్రమాలను చేస్తున్నామన్నారు.మారుమూల గ్రామాల్లో మెడికల్ క్యాంప్‌లు, దుస్తులు పంపిణీ తదితర కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, గ్రామ పెద్దలు డుంబేరి విశ్వనాథం, గాలి వరహాలమ్మ, పంచాయతీ పాలక వర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.

మలేరియా కేసులు నమోదైన గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ


కార్మికులకు శిక్షణ ఇస్తున్న మలేరియా అధికారులు

చింతపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రెండు కంటే అధికంగా మలేరియా కేసులు నమోదైన గిరిజన గ్రామాల్లో దోమల మందు పిచికారీ చేయనున్నట్టు అసిస్టెంట్ మలేరియా అధికారి(ఏఎంవో) నీలకంఠం తెలిపారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోమల మందు పిచికారీపై కార్మికులకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఏఎంవో మాట్లాడుతూ కలెక్టర్, ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు మలేరియా కేసులు నమోదైన గ్రామాల్లో ఈనెల 15తేదీ నుంచి జూన్ 15 వరకు దోమల మందు పిచికారీ చేస్తామన్నారు. సీలేరు సబ్ యూనిట్ పరిధిలో 131, శరభన్నపాలెం 116, చింతపల్లి సబ్ యూనిట్ పరిధిలో 107గ్రామాలను ఎంపిక చేసినట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారులు బుక్కా చిట్టిబాబు, కన్నబాబు, ఎంటీఎస్‌లు గుమ్మా యుగంధర్, శ్రావణి, సూపర్‌వైజర్లు, కార్మికులు పాల్గొన్నారు.

17న డీఎన్ఎస్ సమావేశం

పాడేరురూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లా లాభాపేక్ష లేని పోరం (డీఎన్ఎఫ్) 2025-26లో మొదటి సమావేశాన్ని ఈ నెల 17వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ద్వారా జిల్లా సమగ్రాభివృద్ధి కోసం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశానికి ఎన్జీవో సంఘాల ప్రతినిధులు, సీఎస్ఆర్ అమలు సంస్థల ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్: 7702029434 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

జీసీసీ ద్వారా గిరిజనుల అభివృద్ధికి కృషి

» జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్


గరుగుబిల్లిలో పర్యటిస్తున్న శ్రావణ్‌కుమార్

అనంతగిరి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధికారంతో ప్రజలందరికీ మంచిరోజులొచ్చాయని రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గరుగుబిల్లి, గుమ్మకోట, భీంపోల్ పంచాయతీల్లో ఆయన ఆదివారం పర్యటించారు. గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. నాన్‌షెడ్యూల్డ్ పంచాయతీల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. జీసీసీ ద్వారా గిరిజన ప్రాంతాల్లో చేపట్టాల్సిన పనులపై క్షేత్రస్థాయి పర్యటనలో పరిశీలిస్తున్నారు. గిరిజనులకు అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించి ఆర్థికంగా ఎదిగేందుకు వెతుకుతున్నామన్నారు. యువతకు ఉపాధి కల్పించేలా ప్రణాళికలను రుపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలోని టీడీపీ మండల అధ్యక్షుడు ఎ. బుజ్జిబాబు, ప్రధాన కార్యదర్శి టి.ఆనందరావు, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు కె.అప్పారావు, లక్ష్మణ్‌రావు, శ్యామ్, దేముడు, పి.జగన్‌బాబు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో హక్కుల సాధనకు పోరాటం

»ఆదివాసీగిరిజన సంఘం ప్రధానకార్యదర్శి బాలదేవ్

అరకులోయ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ స్ఫూర్తితో ఆదివాసీ హక్కుల కోసం, చట్టాలు అమలు కోసం పోరాడాలని ఆదివాసీ గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ పిలుపునిచ్చారు. ఆదివారం అంబేడ్కర్ 134వ జయంతిని బస్కీ పంచాయతీ గుగ్గుడ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ... రాజ్యాంగం ద్వారా అంబేడ్కర్ దేశానికి దిశా నిర్దేశం చేశారు. బడుగు,బలహీన వర్గాలకు సమానహక్కులు , దేశంలో సమగ్ర అభివృద్ధికి ఆయన ఆకాంక్షించారన్నారు. అయితే, స్వాతం త్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా దళితులు,ఆదివాసీలు, ఇతర బలహీన వర్గాలు వెనుబడి ఉండడం విచారకరన్నారు. కేంద్రంలో బీజేపీ సర్కార్ ప్రధానంగా ఆదివాసీలకు అడవి నుంచి వేసేలా అటవీసవరణ బిల్లు తెస్తుందన్నారు. అడవులను కార్పొరేట్ వర్గాలకు కట్టబెట్టాలని చూస్తోందన్నారు. ఇందులో భాగంగా అదాని,అంబానీలకు సుమారు 8వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిచేసేందుకు హైడ్రోపవర్‌ప్రాజెక్టులు కట్టబెట్టిందన్నారు. ఉగ్గుడ గ్రామంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు దశరథ్ లో కలిసి బాలదేవ్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారన్నారు.

పాడేరు ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

... 5వ పేజీ తరువాయి

పాడేరు, వడ్డాది మీదుగా అనకాపల్లి వద్ద 16వ నంబరు జాతీయ రహదారిపైకి చేరడానికి వస్తున్నారు. అర్ధరాత్రి పాడేరు చేరుకున్నారు. ఒంటి గంట సమయంలో ఘాట్‌రోడ్డులో వంట్లమామిడి దాటిన తరువాత కోమాలమ్మ పనుకు (ఏసుప్రభు మలుపు) వద్దకు వచ్చే సరికి బ్రేకులు ఫెయిలై వాహనం అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయింది. దీంతో పలువురికి తీవ్రగాయాలయ్యాయి. లోయ కావడం, చీకటిగా వుండడంతో ఎవరై రోడ్డుపైకి రాలేక, పెద్దగా కేకలు వేస్తున్నారు. కొంతసేపటి తరువాత ఈ మార్గంలో వెళుతున్న ద్విచక్ర వాహనదారులు ఆగి, మొబైల్ టార్చి లైట్లతో పరిశీలించారు. కానీ క్షతగాత్రులను రోడ్డుపైకి తీసుకువచ్చే అవకాశం లేకపోవడంతో తెల్లవారుజామున మూడు గంటల సమయంలో మాడుగుల అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఫైర్ ఆఫీసర్ వి.రాజేశ్వరరావు, సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి, లోయలో నుంచి క్షతగాత్రులను రోడ్డుపైకి చేర్చారు. అగ్నిమాపక శకటంలోనే ఎక్కించి ఉదయం 5.30 గంటల సమయానికి మాడుగుల సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. డాక్టర్ సంతోశ్ కుమార్, సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. క్షతగాత్రుల్లో మామిడి అప్పారావు, గుంట కాయేశ్, కొర్రా రామ్, డిప్పా తిరుపతి, గుంట లైకోన్, అభినాయక్ కొంటాల్, గుంట జంబోలకు తీవ్రగాయాలు కావడంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మిగిలిన గెమ్మెలి శ్రీదేవి, కొర్రా సుబంధీ, గెమ్మిలి సునీత, రాధ, గుంట షన్ముఖుడు, కొర్రా రంజిత్, మనోజ్, కొర్రా సింగల్, దోయమతి, లైకోన్‌లకు స్వల్ప గాయాలు కావడంతో మాడుగులలో చికిత్స అందించారు. కాగా ప్రమాదం గురించి తెలుసుకున్న క్షతగాత్రుల కుటుంబ సభ్యులు, బంధువులు ఉదయం 11 గంటలకు ఇక్కడకు చేరుకున్నారు. అనకాపల్లి, మాడుగుల ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని వాహనాల్లో తమ వెంట తీసుకెళ్లారు. కోరాపుట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటామని చెప్పారు. ఈ సంఘటనపై పాడేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నర్సీపట్నం ఆస్పత్రిలో ముగ్గురు క్షతగాత్రులు

... 5వ పేజీ తరువాయి

బాణసంచా తయారీ కేంద్రం లైసెన్స్ అప్పికొండ తాతబ్బాయి పేరున వుందని పోలీసులు తెలిపారు.

రెండు మృతదేహాలకు అనకాపల్లిలో పోస్టుమార్టం..

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కైలాసపట్నంలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడులో మృతిచెందిన వారిలో సామర్లకోటకు చెందిన డి.నిర్మల, భీమిలికి చెందిన ఎం.హేమంత్ మృతదేహాలను స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి తీసుకువచ్చారు. పంచనామా అనంతరం పోస్టుమార్టం నిర్వహించారు. సోమవారం ఉదయం బాధిత కుటుంబీకులకు మృతదేహాలను అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

బతుకు తెరువు కోసం వచ్చాం

- వేళంగి రాజు, సామర్లకోట

మాది కాకినాడ జిల్లా సామర్లకోట. బతుకుతెరువు కోసం నెల రోజుల క్రితం కైలాసపట్నం వచ్చి బాణసంచా తయారీ కేంద్రంలో పనిలో చేరాం. దీనికి సమీపంలో వున్న ఇంటో నివాసం వుంటున్నాం. ఈ రోజు పనిలోకి వెళ్లలేదు. మధ్యాహ్నం భారీ పేలుడు ధాటికి మా ఇంటి గోడలు పడిపోయాయి. నాకు తలకు గాయమైంది. భార్య సంతోషి, కూతురు షరోణికి తీవ్రగాయాలు అయ్యాయి. వారిద్దరిని విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించారు.

సంప్రదాయ రీతిలో ఇటుకల పండగ


ఈటెలు, బాణాలు పూజాలు నిర్వహించి వేటకు సిద్దమవుతున్న గిరిజనులు

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):గిరిజన ఆచార, వ్యవహారాలు విభిన్నంగా ఉంటాయి. ప్రస్తుతం గ్రామాల్లో ఇటుకల పండగ సందడి నెలకొంది. పూర్వీకుల ఆచారాలను తూచతప్పకుండా ఇప్పటి గిరిజనులు పాటిస్తుంటారు.. గ్రామాల్లో శంకుదేవుడికి ప్రత్యేక పూజాలు అనంతరం.. ఇంటిలో ఉన్న ఈటెలు, బల్లెలు, బాణాలకు పూజలు నిర్వహించి వేటకు సిద్ధమవుతుంటారు.. వారం రోజులుగా ఆచార ప్రకారం పండగను గిరిజనులు నిర్వహిస్తారు. పరుషులు వేటకు వెళ్తే.. మహిళలు గ్రామాల్లో తిరుగుతూ.. తాచేరు వసూల్ చేస్తూ ఆనందంగా గడుపుతారు..

డుంబ్రిగుడ: మన్యంలోని గిరిజన గ్రామాల్లో ఇటుకల పండగా ఘనంగా కొనసాగుతోంది. మండలంలోని కోర్రా గ్రామంలో శనివారం సాయంత్రం గ్రామంలో (శంకిడి) నాటకం ఆడడానికి వచ్చిన స్నేహితులకు గ్రామస్థులు మర్యాదలు చేశారు. ఆదివారం ఉదయం స్నేహ పూర్వకంగా స్నానలాడారు. థింసా నృత్యం చేశారు. మధ్యాహ్నం కుటుంబ సమేతంగా భోజనాలు చేసి ఆనందంగా గడిపారు. వచ్చిన స్నేహితులకు సాయంత్రం గొర్రెలు, మేకలతో సాగనంపారు.

ఆర్వీనగర్ పాలగెడ్డ అంతర్రాష్ట్ర రోడ్డు నిర్మించాలి


ధారకొండలో సమావేశమైన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు

సీలేరు, ఏప్రిల్ 13 , (ఆంధ్రజ్యోతి) జీకేవీధి మండలం ఆర్వీనగర్ నుంచి నుంచి వైరామవ రం మండలం పాలగెడ్డ వరకు గల అంతర్రాష్ట్ర రహదారి నిర్మాణం పనులను తక్షణమే ప్రారంభించాలని ధారకొండలో ఐదు పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీసభ్యులు, వివిధ పార్టీల రాజకీయనాయకులు డిమాండ్ చేశారు. కోరుతూ, ఆదివారం ఈ విషయంపై సమావేశమై చర్చించారు. ఈ రహదారి నిర్మాణంపై ఆర్ అండ్‌బీ అధికారులు, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా వీరంతా నినాదాలు చేశారు. ఈ నెల 14 న అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈ రహదారి పనులను వెంటనే ప్రారంభించాలని ప్రతీ గ్రామ పంచాయతీలో తీర్మానాలు చేయాలని వీరంతా నిర్ణయించారు. అనంతరం 16 న సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ప్రజా ప్రతినిధులు, నాయకులు పార్టీలకతీతంగా పాల్గొని ఆర్వీనగర్ పాలగెడ్డ రహదారి పనుల కోసం చేపట్టే కార్యాచరణ కార్యక్రమాల్లో పాల్గొనాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు అంపురంగి బుజ్జిబాబు, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కారే శ్రీనివాస్, , సీలేరు సర్పంచ్ పి. దుర్గో, వలసగెడ్డ పెసా కమిటీ ఉపాధ్యక్షుడు బత్తుల సిద్ధార్థ మార్క్, సీపీఎం నాయకులు బాకూరి కోటేశ్వరరావు, గుమ్మిరేవుల పంచాయతీ మాజీ సర్పంచ్ బాబూరావు, తగ్గి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో మోదకొండమ్మ ఆలయం కిటకిట

పాడేరురూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పాడేరు మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మ న్యం, మైదాన ప్రాంతాలకు చెందిన వందలాది మంది మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు అర కిలోమీటరు మేర బారులు తీరారు. మైదాన ప్రాంతానికి చెందిన భక్తులు అమ్మవారికి పూజలు చేసి, ఘటాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో వంటలు చేసుకొని బంధుమిత్రులతో కలిసి భోజనాలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు, ఆలయ, ప్రసాద కమిటీ ప్రతినిధులు ఉదయం ప్రసాదం, మధ్యాహ్నం అన్నప్రసాదం పంపిణీ చేశారు. అదేవిధంగా ఘాట్‌లోని మోదాపల్లి జంక్షన్ వద్ద గల అమ్మవారి పాదాల వద్దకు వందలాది మంది భక్తులు పూజలు చేశారు. అక్కడే వంటలు చేసుకొని కుటుంబ సభ్యులతో సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు.

పెను విషాదం

... 5వ పేజీ తరువాయి

వెల్లువెత్తుతున్నాయి. కైలాసపట్నం శివారున ఉన్న బాణసంచా కేంద్రానికి 2026 వరకు అనుమతులున్నాయని అధికారులు చెబుతున్నా, అగ్నిమాపక శాఖ నుంచి 2024 తరువాత రెన్యువల్ కోసం నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) పొందలేదని తెలుస్తోంది. ప్రమాదకరమైన పేలుడు సామగ్రి తయారుచేసే ఈ కేంద్రంలో పరిశ్రమల శాఖ నిబంధనల ప్రకారం కార్మికులకు తగిన రక్షణ చర్యలు లేవని అక్కడి పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. భారీగా పేలుడు పదార్థాలు నిల్వ చేసి, సామగ్రి తయారు చేస్తున్నా కనీసం బోర్డు కూడా ఏర్పాటుచేయలేదు. ఈ కేంద్రంలో ఫైర్ ఎక్విప్‌మెంట్ ఉందా, కార్మికులకు మందుగుండు సామగ్రి తయారీపై శిక్షణ ఇచ్చారా..? ముడి పదార్థాల నిల్వలు సురక్షితంగా ఉన్నాయా... అనే ప్రశ్నలకు జవాబు దొరకడం లేదు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు కూడా బాణసంచా కేంద్రానికి అనుమతులున్నాయా లేదా అనేది స్పష్టం చేయలేకపోతున్నారు.

మొక్కుబడి తనిఖీలు

వాస్తవానికి బాణసంచా కేంద్రాలను మండల రెవెన్యూ అధికారి సందర్శించి, ఇచ్చిన నివేదిక మేరకు ఆర్డీఓ స్థాయి అధికారి అనుమతులు జారీచేస్తారు. దీంతోపాటు పరిశ్రమలు, పర్యావరణ, అగ్నిమాపక శాఖలు ఏటా తనిఖీ చేసిన తరువాత మాత్రమే నిరభ్యంతర పత్రాలు ఇవ్వాలి. కాగా ఎలాంటి తనిఖీ చేయకుండానే నివేదికలు సమర్పించి మమ అనిపిస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రమాదం సంభవించిన గంటల తరువాత జిల్లా యంత్రాంగం ఘటనా స్థలానికి చేరుకుంది. అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి వెంకటరమణ తదితరులు ప్రమాద స్థలిని పరిశీలించారు.

కనిపించని పర్యవేక్షణ

జిల్లాలోని బాణసంచా తయారీకేంద్రాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారుల పర్యవేక్షణ కనిపించడం లేదు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారిక రికార్డుల ప్రకారం కోటవురట్ల మండలం కైలాసపట్నం, ఎండపల్లి, నర్సీపట్నం మండలం వేములపూడి, మాకవరపాలెం మండలం భీమబోయినపాలెం, చోడవరం మండలం ఎంకేపాలెం, అచ్యుతాపురంలో మాత్రమే బాణసంచా తయారీ కేంద్రాలకు అనుమతులున్నాయి. అయితే అనధికారికంగా ప్రతి మండలంలో బాణసంచా తయారీ జరుగుతోంది.

ఉమ్మడి జిల్లాలోనూ సంఘటనలు

ఉమ్మడి విశాఖ జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రాల్లో అనేక ప్రమాదాలు సంభవించాయి. 2011లో మొగలిపురంలో అనధికార బాణసంచా తయారీ కేంద్రంలో సంభవించిన పేలుడులో ఇద్దరు మృతి చెందారు. 2019లో సబ్బవరం మండలం గుల్లిపల్లిలో అనధికార బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదంలో ఆరుగురు మృత్యువాతపడ్డారు. జిల్లా పునర్విభజన తరువాత 2022 జూన్‌లో సబ్బవరం మండలం అరిపాకలో అనధికార బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించి నలుగురు మృతిచెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అనుమతులున్న వాటితో పాటు, అనధికార బాణసంచా తయారీ కేంద్రాల్లో భద్రతా చర్యలు శూన్యమనేది బహిరంగ రహస్యం. వీటిలో ప్రమాదాలు సంభవిస్తున్నా బయటకు పొక్కనీయడం లేదు.

ప్రతి కుటుంబానిదీ ఓ దీనగాథ

కోటవురట్ల/ నర్సీపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కైలాసపట్నంలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడులో మృతిచెందిన వారి కుటుంబాల్లో ఒక్కొక్కరిది ఒక్కో గాథ. ప్రమాదంలో మృతిచెందిన దాడి రామలక్ష్మి ఒంటరిగా జీవిస్తున్నది. ఆరేళ్ల క్రితం భర్త చనిపోయాడు. కుమార్తె ధనలక్ష్మికి గతంలోనే వివాహమైంది. ఆమె ఎలమంచిలి మండలం జంపపాలెంలో వుంటున్నది. మరో మృతుడు గంపెన వేణుకి భార్య భవాని,, కూతురు, కొడుకు ఉన్నారు. గుర్తు పట్టలేనంతగా వేణు మృతదేహం కాలిపోయింది. మొదట్లో చేనేత కార్మికుడిగా పని చేసేవాడు. ఆ వృత్తి కలిసి రాకపోవడంతో బాణసంచా తయారీ కేంద్రంలో కూలీగా వెళుతూ, ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు

కైలాసపట్నం గ్రామానికి చెందిన పురం పాప భర్త చనిపోయి 10 సంవత్సరాలు అవుతున్నది. ఈమెకు ఇద్దరు పిల్లలు వున్నారు. బాణసంచా ప్రమాదంలో ఆమె చనిపోవడంతో పిల్లలు అనాథలయ్యారు. కైలాసపట్నం గ్రామానికి చెందిన సంగరాతి గోవిందకు భార్య, ఇద్దరు పిల్లలు పిల్లలు వున్నారు. ఆయన మృతితో కుటుంబం వీధిన పడింది.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కేజీబీవీల్లో తేగాడ విద్యార్థిని టాప్

▸ 15న మంత్రి లోకేశ్ ద్వారా అవార్డు అందుకోనున్న రాజులమ్మ

▸ వివరాలు వెల్లడించిన ప్రిన్సిపాల్ చంద్రకళ


కె.రాజులమ్మ

కశింకోట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల న్నింటిలోనూ మండలంలోని తేగాడ కేజీబీవీ ప్రథమ స్థానంలో నిలిచినట్టు ప్రిన్సిపాల్ దొండా చంద్రకళ ఆదివారం తెలిపారు. ఇక్కడ విద్యనభ్యసించిన బైపీసీ విద్యార్థిని కె.రాజులమ్మ 1000/983 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిందన్నారు. ఈ మేరకు ఈనెల 15న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా విజయవాడలో రాజులమ్మ సన్‌షైన్ స్టార్స్ అవార్డు అందుకునేందుకు ఎంపికైనట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆమెను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, డీఈవో గిడ్డి అప్పారావునాయుడు, అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఆర్.జయప్రకాశ్ తదితరులు అభినందించారు. ఇదిలావుంటే, తేగాడ కేజీబీవీ నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 30 మంది హాజరుకాగా, 29 మంది ఉత్తీర్ణులయ్యారని, అలాగే, ద్వితీయ సంవత్సరం 28 మంది పరీక్షలు రాయగా 26 మంది పాసయ్యారని ప్రిన్సిపాల్ వివరించారు.

గాంధీజీ విగ్రహానికి ఆర్టీసీ కార్మికులు వినతి పత్రం


మహాత్ముని విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : సమస్యలపై పలువురు ఆర్టీసీ కార్మికులు ఆదివారం ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మార్కెట్ యార్డులోని మహాత్మాగాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. అక్రమ సస్పెన్షన్లను రద్దు చేసి డ్రైవర్, కండక్టర్లను విధుల్లోకి తీసుకోవాలని, సీ అండ్ టీ కేసుల్లో పాయింట్ల విధానాన్ని అమలు చేయాలని, అక్రమ కేసులు రాస్తున్న తనిఖీ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎన్‌ఎంయూఏ జోనల్ కార్యదర్శి పి.సుధాకర్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పశు పక్ష్యాదుల సంరక్షణ అందరి బాధ్యత


పార్కులో కుండలు ఏర్పాటును ప్రారంభిస్తున్న సభ్యులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు పార్కుల ఆవరణలో ఆదివారం గ్రీన్ క్లబ్ నిర్వాహకులు పక్షుల కోసం ధాన్యపు కుంచెలు, మట్టిపాత్రల్లో తాగునీరు, గూళ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తొలుత ప్రముఖ వైద్యుడు కేకేపీఏ నారాయణరావు మాట్లాడుతూ వేసవిలో పక్షుల కోసం ఇటువంటి ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ పశు పక్ష్యాదులను, అడవులను కాపాడుకోవాలన్నారు. అలాగే ప్రతి ఇంటి వద్ద పక్షుల కోసం తిండి గింజలు, తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్, బీరా వినోద్‌కుమార్, కాండ్రేగుల సత్యనారాయణ, పెంటకోట సురేష్, యల్లపు సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ స్తంభాల ఏర్పాటు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి లక్ష్మీదేవిపేటలోని పాత్రుడు కాలనీలో ఈపీడీసీఎల్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. శనివారం మధ్యాహ్నం వీచిన భారీ ఈదురు గాలులకు ఈ కాలనీలో రెండు స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సౌకర్యం లేక నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇది గుర్తించిన ఈపీడీసీఎల్ అధికారులు ఆదివారం ఉదయం క్రేన్ సాయంతో స్తంభాలను ఏర్పాటు చేసి, విద్యుత్ వైర్లను పునరుద్ధరించారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడ్ని చూపుతున్న పోలీసులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడ్ని శనివారం రాత్రి అరెస్టు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. ఈ ఏడాది జనవరి ఆరో తేదీన ఏఎంఏఎల్ కళాశాల సమీపాన గల ఏలేరు కాలువ వద్ద మూడు కిలోల గంజాయితో అప్పట్లో నలుగుర్ని అరెస్టు చేశామన్నారు. ఆ కేసులో మరో ఇద్దరు కూడా అరెస్టయినట్టు చెప్పారు. పరారీలో ఉన్న మాడుగుల మండలం సాగరం గ్రామానికి చెందిన వీవీ నాగరాజును ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం వద్ద గల ఆటో స్టాండ్‌లో అరెస్టు చేసి కోర్టుకు తరలించామని ఎస్‌ఐ చెప్పారు.

కూటమి నేతల కసరత్తు

▸ జీవీఎంసీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గేలా వ్యూహం


దసపల్లా హోటల్‌లో సమావేశమైన కూటమి నేతలు

విశాఖపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నగర మేయరు గొలగాని హరి వెంకటకుమారిపై ఈనెల 19వ తేదీన ప్రవేశపెట్టనున్న అవిశ్వాస తీర్మానం నెగ్గేందుకు అవసరమైన వ్యూహాలపై కూటమి నేతలు ఆదివారం దసపల్లా హోటల్‌లో సమావేశమయ్యారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మేయరుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు అవసరమైన బలం సమకూర్చుకున్నామని పలువురు నేతలు వెల్లడించారు. రెండురోజుల క్రితమే మేయరు పీఠం కూటమి కైవశం చేసుకునేలా కార్పొరేటర్ల మద్దతు కూడగట్టామని వివరించారు. అయితే ఈనెల 19న అవిశ్వాస తీర్మానం పెట్టే రోజున కార్పొరేటర్లకు తగిన సూచనలు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేష్‌బాబు, సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.ప్రణవ్‌గోపాల్, జీవీఎంసీలో టీడీపీ ఫ్లోర్‌లీడరు పీలా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


అమ్మవారి దర్శనానికి బారులుతీరి ఉన్న భక్తులు

దారులన్నీ అమ్మ ఆలయం వైపే..

▸ భక్తులతో కిటకిటలాడిన నూకాంబిక ఆలయం ▸ ఉమ్మడి జిల్లాల నుంచి భారీగా తరలి రాక ▸ రోడ్డుపైకి చేరిన క్యూలైన్లు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్య జాతర కొనసాగుతున్న నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చారు. తెల్లవారుజాము ఆరు గంటలకు బాలాలయంలోని అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తెల్లవారుజామున ఐదు గంటల నుంచే ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తుల రాక ఆరంభం కావడంతో ఆలయానికి వచ్చే మార్గాలన్నీ సందడిగా మారాయి. ఆలయం లోపల, ఆవరణలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు నిండిపోవడంతో రోడ్డుపై కూడా భక్తులు క్యూ కట్టి దర్శించుకున్నారు. పసుపు, కుంకుమ, చీరలు, పండ్లు తదితరాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఉత్సవ ప్రత్యేకాధికారిణి శోభారాణి, ఈవో రాంబాబు భక్తులకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆలయ మాజీ చైర్మన్ బీఎస్ఎంకే జోగినాయుడు, ఉత్సవ కమిటీ సభ్యుడు దాడి రవికుమార్, సూరే సతీష్, మారిశెట్టి వెంకటరావు, మజ్జి శ్రీనివాసరావు, కాండ్రేగుల రాజారావు, పొలిమేర ఆనంద్, కొడుకుల శ్రీకాంత్ తదితరులతో పాటు ఆలయ సిబ్బంది క్యూలో ఉన్న భక్తులకు మంచినీరు, పిల్లలకు పాలు అందజేశారు. పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయానికి వచ్చే మార్గాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు. ఇదిలావుంటే, అమ్మవారిని ఆదివారం సాయంత్రం మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దంపతులు, భగవద్గీత ప్రవచనకర్తలు దర్శించుకున్నారు. వీరికి ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఈవో వెంపలి రాంబాబులు స్వాగతం పలికారు.


ఎన్టీఆర్ స్టేడియంలో ఆధ్యాత్మిక కార్యక్రమాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేలు కొణతాల, బండారు

ఆకట్టుకున్న భగవద్గీత ప్రవచనాలు

నూకాంబిక జారతలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం రాత్రి భగవద్గీత ప్రవచనాలను నిర్వహించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, గంగాధర శాస్త్రి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. సామాజికవేత్త కాండ్రేగుల శ్రీరామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానాల్లో భాగంగా అమ్మవారి పండుగను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎల్‌వీ గంగాధర శాస్త్రి, రుగ్వేద అధ్యాపకులు సంతోష్‌కుమార్, ఆంధ్ర నాట్య కళాకారిణి టీఎస్ సుభారాజేశ్వరి భగవద్గీత ప్రవచనాలను చక్కగా వినిపించారు. అనంతరం శిల్పి కామధేను ప్రసాద్‌కు ఉగాది పురస్కారం అందజేశారు. ముందుగా కళాకారులు వినాయకుని స్తుతిస్తూ నృత్యం చేశారు.

బయ్యవరంలో స్తంభం పైనుంచి పడి హెల్పర్‌కు తీవ్ర గాయాలు!

▸ విశాఖలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సలు

కశింకోట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ పరిధిలో ఉన్న కాంట్రాక్ట్ కార్మికుడు బయ్యవరంలో విద్యుత్ స్తంభంపై పనిచేస్తుండగా, షాక్‌కు గురై కింద పడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి స్థానికుల ద్వారా తెలిసిన వివరాలివి. మాడుగుల నియోజకవర్గంలో ఉన్న వంటర్లపాలెం ప్రాంతానికి చెందిన సిహెచ్. శంకరరావు శనివారం ఉదయం 10.30 గంటల సమయంలో బయ్యవరంలో ఉన్న విద్యుత్ స్తంభంపై పనిచేస్తున్నాడు. ఒక్కసారిగా హెచ్‌టీ లైన్‌కు కరెంటు పాస్ కావడంతో దానికి చెయ్యి తలిగి కింద పడిపోయినట్టు తెలిసింది. ఈ ప్రమాదంలో శంకరరావు తలకు తీవ్ర గాయమైంది. విషయం తెలుసుకున్న స్థానికులు సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన అనకాపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నంలోని ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్సలు పొందుతున్నట్టు సమాచారం.

లైన్‌మన్ తప్పిదం వల్లే ప్రమాదం..?

స్తంభం వద్ద ఉన్న స్థానిక లైన్‌మన్ తప్పిదమే ప్రమాదానికి కారణమనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. పని పూర్తికాకుండానే లైన్ షిఫ్టింగ్ (ఎల్‌సీ) చేయడం వల్లే కరెంటు సరఫరా అయి ఉండవచ్చునని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికునికి పూర్తి సహాయ సహకారాలకు కృషి : ఈఈ

పనులు చేయిస్తున్న కాంట్రాక్టర్ పూర్తి నిబంధనలు పాటించాలని ఎప్పటికప్పుడు సూచిస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంబంగి రామకృష్ణ తెలిపారు. సదరు కార్మికునికి పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు సంస్థ నుంచి కృషి చేస్తామన్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న వాటిపై సిబ్బందితో పాటు కాంట్రాక్టర్ కార్మికులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

రహదారిపై తెగిపడిన తీగ

▸ తప్పిన పెను ప్రమాదం

పరవాడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ ప్రధాన రహదారిలోని బొంకుల దిబ్బ వీధి వద్ద ఆదివారం రాత్రి వీధి దీపాలకు సంబంధించిన విద్యుత్ తీగ రహదారిపై తెగిపడింది. ఆ సమయంలో అటుగా వాహనాలతో పాటు పాదచారులు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయాన్ని గమనించిన స్థానిక యువకులు లైన్‌మెన్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన వెంటనే సరఫరాను నిలుపుదల చేశారు. మరమ్మతు పనుల అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కాలం చెల్లిన విద్యుత్ తీగలు కావడంతో తెగిపడ్డాయని స్థానికులు చెబుతున్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు.


రహదారిపై తెగిపడిన విద్యుత్ తీగ

సింహాద్రి నాలుగో యూనిట్‌లో ఉత్పత్తి పునరుద్ధరణ

పరవాడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగో యూనిట్‌లో ఉత్పత్తిని ఆదివారం పునరుద్ధరించారు. ఇదే యూనిట్‌కు సంబంధించిన బాయిలర్ ట్యూబ్‌లకు రంధ్రాలు ఏర్పడడంతో శుక్రవారం ఉత్పత్తి అర్ధంతరంగా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టి యూనిట్‌లో ఉత్పత్తిని పునరుద్ధరించారు. ప్రస్తుతం ప్లాంట్‌లోని అన్ని యూనిట్లలో ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరుగుతుందని అధికారులు తెలిపారు.

నేటి నుంచి పైడిమాంబ జాతర



లంకెలపాలెం/పరవాడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పెదముషిడివాడ, పరిసర గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత పైడిమాంబ జాతర సోమవారం ప్రారంభం కానుంది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకలకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గ్రామంలో విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. ఉత్సవ కమిటీ, యువజన సంఘాల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం రాత్రి అమ్మవారి తొలేళ్ల ఉత్సవం, మంగళవారం అనుపోత్సవం జరుపుతామని ఆలయ కమిటీ చైర్మన్ పల్లా అప్పారావు తెలిపారు.

గుర్రపు స్వారీ ప్రదర్శన పోటీలు రేపు

ఇదిలావుంటే, అమ్మవారి పండుగ సందర్భంగా మంగళవారం జిల్లాస్థాయి గుర్రపుస్వారీ ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలు అందజేస్తామని చెప్పారు.

వైద్య శిబిరంలో వంద మందికి పరీక్షలు


రోగికి పరీక్షలు జరుపుతున్న వైద్యుడు

సబ్బవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పెదగొల్లలపాలెంలోని శ్రీకృష్ణ మందిరం ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పెదగొల్లపాలెంతో పాటు పరిసర గ్రామాల నుంచి సుమారు వంద మంది వరకు రోగులు విచ్చేశారు. వీరందరికీ వైద్యులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. పలువురు మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరిపినట్టు చిన్మయి మిషన్ నిర్వాహకులు స్వామి రఘువీరానంద్ తెలిపారు. విశాఖ స్టీల్ జనరల్ ఆస్పత్రి, మెడికవర్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో జయంతికుమార్, న్యాయ వాది దివ్యప్రసాద్, క్యాంప్ కో-ఆర్డినేటర్ డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ జె.సారంగి, డాక్టర్ శాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ముద్రించిన ఉగాది తెలుగు క్యాలెండర్‌ను పోలీస్ అధికారులు ఆదివారం ఇక్కడ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగేశ్వరస్వామి రచించిన జ్ఞాన తెలుగు కాల సూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరికీ సరళమైన భాషలో అర్థమయ్యే విధంగా రూపొందించారని వివరించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు శ్రీనివాస్, రమణ అక్షయ్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

'తెలికుల సంక్షేమ సంఘం బలోపేతానికి కృషి'


సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు వెంకటరావు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అఖిల గాండ్ల తెలికుల సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని సంఘం జిల్లా అధ్యక్షుడు గండేపల్లి వెంకటరావు అన్నారు. ఆదివారం ఇక్కడ జరిగిన సంఘ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. అన్ని మండలాల్లో గల తెలికుల కులస్థులను సమీకరించి, వారిలో చురుకైన వారిని జిల్లా శాఖలకు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో 20వేల మంది తమ సామాజికవర్గం వారు ఉన్నట్టు చెప్పారు. బీసీ కులాల్లో అత్యంత వెనుకబాటుతో మగ్గిపోతున్న తమ కులస్థులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. కల్యాణ మండపం నిర్మాణానికి అవసరమైన స్థలం, నిధులు కేటాయించాలని ఎంపీ, ఎమ్మెల్యేలను కోరనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మనాపల్లి సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శి కొమ్మనాపల్లి వాసుదేవరావు, కోశాధికారి రాజపూడి కోటేశ్వరరావు, గౌరవాధ్యక్షులు ఇంజరపు జ్ఞానేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రపంచ శాంతికి చిహ్నం మట్టల ఆదివారం'


గాంధీనగరంలో ఈత మట్టలతో ర్యాలీ


సబ్బవరంలో...

తుమ్మపాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మట్టల ఆదివారం వేడుకలను క్రైస్తవులంతా అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పిల్లలు, పెద్దలు అంతా కలిసి ఈత మట్టలను అందంగా అలంకరించి, చేతపట్టుకుని వాడవాడలా ర్యాలీగా ముందుకు సాగారు. ప్రపంచ శాంతికి చిహ్నంగా మట్టల ఆదివారాన్ని నిర్వహిస్తున్నట్టు పలువురు పాస్టర్లు తెలిపారు. అనకాపల్లి గాంధీనగరంలో గల ఏసుకరుణ ప్రార్థనా మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాస్టర్ విక్టర్ డేవిడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రపంచ శాంతిని కోరుతూ ప్రార్థనలు చేయాలన్నారు. క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండల కేంద్రం సబ్బవరంలోని కేథలిక్ చర్చితో పాటు అమృతపురం, అంతకాపల్లి, ఆరిపాక, సాయినగర్ తదితర ప్రాంతాల్లో గల చర్చిల్లో మట్టల ఆదివారం పండుగను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సబ్బవరం కేథలిక్ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవులు భక్తిగీతాలను ఆలపిస్తూ మట్టలను చేతబట్టి ర్యాలీగా ముందుకు సాగారు. ఫాదర్ పులి కల్ థామస్, వి.కృష్ణారావు, పి.మాణిక్యాలరావు, ఆడారి నాగరాజు, గణేశ్, పాలవెల్లి, సామ్రాట్ కుమార్, నవీన్, కుమారి, రమణమ్మ పాల్గొన్నారు.

గవర జేఏసీ నూతన పాలకవర్గం ప్రమాణం


ప్రమాణస్వీకారోత్సవంలో మాట్లాడుతున్న మళ్ల సురేంద్ర

కొత్తూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : గవర జేఏసీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఇక్కడి కొణతాల సుబ్రహ్మణ్యం కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ హాజరై నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గవర సామాజికవర్గంలో ప్రధాన సమస్యలను తమకు వివరిస్తే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఎం.నాయుడు, కర్రి సన్యాసినాయుడు, బొడ్డేడ మహాలక్ష్మినాయుడు, బుద్ద రమణాజీ, కొణతాల రత్నకుమారి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి గవర సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

డాక్‌యార్డు ఉద్యోగుల సంక్షేమానికి కృషి

▸ సంఘం అధ్యక్షుడు దాసుబాబు



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు దాసుబాబు

సబ్బవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : నేవల్ డాక్‌యార్డు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.దాసుబాబు అన్నారు. మండలంలోని మలునాయుడుపాలెంలో ఆదివారం నేవల్ డాక్‌యార్డు ఉద్యోగుల సంక్షేమ సంఘ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల కుటుంబాలకు ఎటువంటి సమస్య వచ్చినా సంఘం అండగా ఉంటుందన్నారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలక్ష్మి జ్యూలర్స్ అధిపూత పీఏ నాయుడు, పి.అనిల్‌కుమార్, కార్యవర్గ సభ్యులు రొంగలి కృష్ణారావు, సొర్లపూడి సత్యం, అచ్యుతరావు, రావిపల్లి రవి, కొల్లి ప్రసాద్, ఆర్.రమణ, గొర్లె దేముడుబాబు, హరీష్, శ్రీరాములు, ఎర్నాయుడు, చినరాము, ఈశ్వరరావు, అచ్చింనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419